విలేకరులు కావలెను

చట్టం మీ చుట్టం జాతీయ తెలుగు దిన పత్రిక

ప్రతి క్షణం ప్రజల పక్షం నిలబడే
చట్టం మీ చుట్టం దినపత్రికకు ఆంధ్రప్రదేశ్
మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని జిల్లాల
వ్యాప్తంగా విలేకరులు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్
9581419999

చట్టం మీ చుట్టం

జాతీయ తెలుగు దిన పత్రిక

సంపుటి : 14 • సంచిక : 121 Simultaneously Published from Kurnool AP &TS, Bengaluru, Mumbai, Chennai, Kerala, Patna, Kolkata & Delhi గురువారం 14 మే 2026 • పేజీలు : 8 • వెల 2/-

## ఎయిర్ ఇండియా సంచలన నిర్ణయం

### పలు అంతర్జాతీయ సర్వీసులు నిలిపివేత



**న్యూఢిల్లీ,మే13 (చట్టం):** ఎయిర్ ఇండియా విమానయాన సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై పలు అంతర్జాతీయ విమాన సర్వీసులను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఇంధన ధరల పెరుగుదల, గగనతల ఆంక్షల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు మొత్తం ఆరు ప్రధాన

మిగతా 2వ పేజీలో..

## చమురు సంక్షోభంతో పొదుపు మంత్రం

- కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను తగ్గించిన ప్రధాని
- అదేబాటలో హోంమంత్రి అమిత్ షా
- పలు రాష్ట్రాల సిఎంలు కూడా పొదుపుబాట



**న్యూఢిల్లీ,మే13 (చట్టం):** పశ్చిమాసియా ఉద్రిక్తతల ఫలితంగా గత కొంతకాలంగా ముడి చమురు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. చమురు దిగుమతులపై ఆధారపడ్డ అనేక దేశాల్లో సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో భారతీయులు కూడా వృథా ఖర్చులు తగ్గించుకుని పొదుపు చర్యలను చేపట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ప్రధాని పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు ప్రధాని తన కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను సగానికి తగ్గించాలని ఆదేశించినట్టు జాతీయ మీడియాలో

మిగతా 2వ పేజీలో..

## పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యం

### పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల అనివార్యం

### ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ,మే13 (చట్టం):** పశ్చిమాసియా ఉద్రిక్తతల ఫలితంగా చమురు ధరలు పెంచక తప్పదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇలానే కొనసాగితే భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరల పెంపు తప్పకపోవచ్చన్నారు. స్విట్జర్లాండ్‌లో స్విస్ నేషనల్ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఎఓఈ) నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో ఈ మేరకు ఆయన మాట్లాడారు. ఇరాన్ యుద్ధం కారణంగా ముడి చమురు సరఫరాకు ఆటంకం కలిగితే, ప్రభుత్వం ఆ భారాన్ని వినియోగదారుల పైకి బదిలీ చేసే అవకాశం ఉందని గవర్నర్ అన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాలను తగ్గించిందని, చమురు కంపెనీలు నష్టాలను భరిస్తూ ధరలను నియంత్రిస్తున్నాయని గవర్నర్ తెలిపారు. అయితే ఇది ఎంతకాలం సాధ్యమవుతుందనేది ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. చమురు ధరలు పెరిగితే అది దేశ ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా వస్తువుల రవాణా ఖర్చులపై ప్రభావం చూపి ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించాలని, వీలైనంత వరకు ప్రజా రవాణాను

మిగతా 2వ పేజీలో..

## బంగారం, వెండిలపై కస్టమ్స్ డ్యూటీ పెంపి

### 6నుంచి 15 శాతానికి పెంచిన కేంద్రం




**న్యూఢిల్లీ,మే13 (చట్టం):** బంగారం, వెండి దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని కేంద్రం తాజాగా పెంచింది. బేసిక్ కస్టమ్స్ డ్యూటీని 10 శాతానికి, అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్టక్చర్ అండ్ డెవలప్‌మెంట్ సెస్‌ను 5 శాతానికి పెంచింది. దీంతో, మొత్తం దిగుమతుల సుంకం 15 శాతానికి చేరింది. గతంలో ఇది 6 శాతంగా ఉండేది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ రికార్డు స్థాయిలో 95.75కి పతనమైన నేపథ్యంలో అప్రమత్తమైన ప్రభుత్వం కస్టమ్స్ డ్యూటీని పెంచింది. బంగారం వినియోగంలో భారత్ ప్రపంచంలో రెండో స్థానంలో ఉన్న విషయం తెలిసిందే. వెండి వినియోగంలో ప్రథమ స్థానంలో ఉంది. దేశీయ అవసరాల కోసం భారత్ ఎక్కువగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇక ఈక్విటీ మార్కెట్‌లో రాబడులు మందగించిన నేపథ్యంలో గతేడాది భారత్‌లో బంగారానికి డిమాండ్ పెరిగింది. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ నివేదిక ప్రకారం, ఈ మార్చితో

మిగతా 2వ పేజీలో..

## రొయ్యల ఫీడ్ ధరలో ఆక్వా రైతుల కుదేలు

- వెంటనే రైతులను ఆదుకోవాలి
- కేంద్రానికి చంద్రబాబు లేఖ



**అమరావతి,మే13 (చట్టం) :** రొయ్యల ఫీడ్ తయారీలో ఉపయోగించే ముడి పదార్థాల ధరలు పెరగడంతో ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. రొయ్యల

మిగతా 2వ పేజీలో..

# అమరావతితో పాటే విశాఖ అభివృద్ధి

- అక్కడ ఇప్పటికే అనేక సంస్థలు రాక
- టెక్నాలజీ హబ్‌గా రాయలసీమ
- తిరుపతిలో ఏరోస్పేస్ సిటీ అభివృద్ధి
- కర్నూలులో డ్రోన్ సిటీ ఏర్పాటు
- కిమ్స్ ఆసుపత్రి శంకుస్థాపనలో సిఎం చంద్రబాబు


**అమరావతి,మే13 (చట్టం) :** అభివృద్ధి విషయంలో ఒక్క అమరావతిపైనే శ్రద్ధ పెట్టట్లేదని.. విశాఖనూ విశ్వనగరంగా చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విశాఖను ఐటి పరంగా అభివృద్ధి చేస్తున్నామని, ఇప్పటికే అనేక ప్రాజెక్టులు అక్కడ వచ్చాయని అన్నారు. రాజధాని ప్రాంతంలో కిమ్స్ ఆసుపత్రి, వైద్య విశ్వవిద్యాలయం నిర్మాణానికి బుధవారం సీఎం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. 'రాయలసీమను రతనాల సీమగా మారుస్తున్నాం. ఆ ప్రాంతానికి అనేక పరిశ్రమలు వస్తున్నాయి. ఏరో స్పేస్ హబ్‌గా అనంతపురం

మిగతా 2వ పేజీలో..



## నీట్‌ను పూర్తిగా రద్దు చేయాలి

### తమిళనాడు సిఎం విజయ్ డిమాండ్



**చెన్నై,మే13 :** దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే 'జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష-యూజీ'ని (నీట్-యూజీ) మొత్తానికే రద్దు చేయాలని తమిళనాడు సీఎం విజయ్ డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ కావడం, పరీక్ష రద్దు వంటివి.. వ్యవస్థాగత లోపాలకు నిదర్శనమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మొదటినుంచి నీట్‌ను

మిగతా 2వ పేజీలో..

## పుదుచ్చేరి సిఎంగా రంగస్వామి ప్రమాణం

- వరుసగా ఐదోసారి సిఎంగా బాధ్యతలు
- ప్రమాణ కార్యక్రమానికి నితిన్ నబీన్ హాజర్
- ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని



**పుదుచ్చేరి,మే13 (చట్టం):** కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా ఎన్.రంగస్వామి ప్రమాణ స్వీకారం చేశారు. లోక్ భవన్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ కె. కైలాసనాథన్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. నమశ్శివాయం, మల్లాడి కృష్ణారావు కేబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. పుదుచ్చేరిలో ఐదోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఎన్.రంగస్వామి రికార్డు నెలకొల్పారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సహా పలువురు సీనియర్ బీజేపీ నాయకులు, మిత్రపక్షాల నేతలు, ఎన్నికైన ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం మీడియాతో

మిగతా 2వ పేజీలో..

## నేడు ఎపి కేబినేట్ భేటీ


### పలు కీలక అంశాలపై చర్చ

**అమరావతి,మే13 (చట్టం):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం కేబినెట్ భేటీ జరగనుంది. ఉదయం 10:30 గంటలకు ఏపీ సచివాలయంలో మంత్రిమండలి సమావేశం కానుంది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పొదుపు పిలుపు, చర్యలపై సీఎం, మంత్రులు ప్రత్యేకంగా చర్చించనున్నారు. అనంతరం దీనిపై అధికారులు, మంత్రులకు సీఎం చంద్రబాబు పలు కీలక సూచనలు చేసే అవకాశం కనిపిస్తోంది.ఏపీలోని ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ అంశంపైనా మంత్రిమండలిలో సుదీర్ఘంగా చర్చించనున్నారు. 17వ ఎస్ఐపీబీ ఆమోదించిన పలు అంశాలపైనా చర్చించి ఆమోదం తెలపనున్నారు. మొత్తం 25 ప్రాజెక్టులకు సంబంధించి రూ.2,01,023 కోట్ల పెట్టుబడులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. విశాఖలో రూ.1 లక్ష కోట్లతో రిలయన్స్ డేటా సెంటర్‌కు మంత్రిమండలి ఆమోదం తెలపనుంది. సత్యసాయి జిల్లాలో రూ.51 వేల కోట్లతో సోలార్ పవర్ ఎ÷-లాంట్‌కు ఆమోదం ఇవ్వనుంది. కడపలో రూ.12 వేల కోట్లతో అదానీ గ్రూప్ హైడ్రో ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు ఆమోదముద్ర వేయనుంది. తిరుపతిలో రూ.2,500 కోట్లతో రాయల్ ఎన్‌ఫీల్డ్ ద్విచక్రవాహన తయారీ పరిశ్రమకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. పలు కీలక సంస్థలకు భూ కేటాయింపులకు సంబంధించి సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రిమండలి ఆమోదం తెలపనుంది.

-------

# విశ్వాస పరీక్షలో నెగ్గిన విజయ్

- తమిళనాడు అసెంబ్లీలో 144 మంది మద్దతు
- విశ్వాస పరీక్షను బహిష్కరించిన డిఎంకె
- అనాడిఎంకె చీలిక వర్గం టివికెకు అనుకూల ఓటు
- ప్రజల విశ్వాసాన్ని కాపాడుకుంటామన్న సిఎం విజయ్



**చెన్నై,మే13(చట్టం) :** తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ తన బలాన్ని నిరూపించుకున్నారు. బుధవారం జరిగిన బలపరీక్షలో 144 మంది ఎమ్మెల్యేలు అధికార టీవీకే పార్టీకి అనుకూలంగా ఓటు వేశారు. మరో 22 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. ఐదుగురు ఎమ్మెల్యేలు తటస్థంగా ఉన్నారు. ఈ సందర్భంగా మూజువాణి ఓటుకు బదులుగా స్పీకర్ సభలో ఒక్కో సభ్యుడి మద్దతు గురించి అడిగి తెలుసుకుని వారి ఓటును నమోదు చేసుకున్నారు. కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు, వీసీకే, ఐయూఎమ్ఎల్ పార్టీల ఎమ్మెల్యేలు టీవీకేకు అనుకూలంగా ఓటు వేశారు. అన్నాడీఎంకేకు చెందిన పలువురు రెబెల్ ఎమ్మెల్యేలూ విజయ్‌కు మద్దతుగా నిలిచారు. ఇక డీఎంకే ఈ విశ్వాసపరీక్షను బహిష్కరించింది. పార్టీకి చెందిన 59 మంది ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. దీంతో, సభలో సభ్యుల సంఖ్య తగ్గి మ్యాజిక్ మార్కులో కూడా ఆ మేరకు కోత పడింది. ఈ క్రమంలో బలపరీక్షలో సీఎం విజయ్ సులువుగా నెగ్గారు. ఈ సందర్భంగా సీఎం విజయ్ ప్రసంగిస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వంలో అందరికీ సమాన అవకాశాలు ఉంటాయని హామీ ఇచ్చారు. ప్రజలను నమ్ముకునే ఎన్నికల బరిలోకి దిగామని గుర్తు చేసుకున్నారు. అన్ని వర్గాలకు తమపై నమ్మకం ఉందని అన్నారు. తమను గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇక టీవీకేకు మద్దతిచ్చిన అన్నాడీఎంకే రెబెల్ ఎమ్యెల్యేల తరపున సీనియర్ నేత వేలుమణి మాట్లాడుతూ తాము ఎలాంటి మంత్రి పదవులనూ ఆశించట్లేదని అన్నారు. ప్రలోభాలు చూపించి మద్దతు కూడగట్టాల్సిన అవసరం తమకు లేదని సీఎం విజయ్ ఈ సందర్భంగా బదులిచ్చారు. తమ ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతిచ్చిన పార్టీలకు మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు. మా ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఉంటుంది. లౌకిక విధానాన్ని అవలంబిస్తూ పాలన సాగిస్తాం. గత ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తాం. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టిసారిస్తాం. అందరికీ సామాజిక న్యాయాన్ని అందించే బాధ్యత మాది' అని విజయ్ పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా ఓఎస్‌డీ నియామకంపై వచ్చిన విమర్శలపై స్పందిస్తూ.. దాన్ని పునఃసమీక్షిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రికి ప్రత్యేక విధుల అధికారిగా

మిగతా 2వ పేజీలో..

# ప్రధాని మోడీ పొదుపు పిలుపు ఆవశ్యం

- మనం కూడా ఆచరించి భాగస్వాములం అవుదాం
- కాన్వాయ్‌లు, భద్రతా సిబ్బందిని కుదించుకుందాం
- నిడమర్రులో జరిగిన కార్యక్రమంలో చంద్రబాబు



**అమరావతి,మే13** : పశ్చిమాసియా యుద్ధ పరిస్థితుల వల్ల దేశంపై పలు విధాలుగా భారం పడుతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రధాని ప్రకటించిన 8 పొదుపు సూచనలు పాటించాలని ప్రజలకు సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. మరో రెండు రోజుల్లో ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వ పరంగా కూడా ఓ కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. ఇలాంటి క్లిష్ట సమయాల్లో ప్రభుత్వాలతో పాటు, ప్రజలు కూడా బాధ్యతగా ఉండాలని సూచించారు. ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు 8 సూచనలను మనం పాటించాలని.. తాత్కాలికంగా వచ్చే ఇబ్బందులను అధిగమించాలని దిశానిర్దేశర చేశారు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించిన పొదుపు సూచనలపై సీఎం స్పందించారు. నిడమర్రులో సీఎం చంద్రబాబు బుధవారం పర్యటించారు. కిమ్స్ ఆస్పత్రికి భూమి పూజ చేశారు. బైసర్ స్కిల్ వర్సిటీ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, అమలాపురం ఎంపీ హరీశ్ బాలయోగి, మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. పెట్రోలు, డీజిల్ వినియోగం తగ్గించాలని.. దీని వల్ల విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుందని చెప్పుకొచ్చారు. వర్క్ ఫ్రమ్ హోమ్ అనేది రియాలిటీ అని.. ఇంటి నుంచే ప్రపంచం మొత్తం పనిచేసే పరిస్థితి వస్తుందని.. దీనిని ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వంలోనూ ఈ తరహా విధానాన్ని అమలు చేసే పరిస్థితులు వస్తాయని.. దేశం మొత్తం దుబారాను తగ్గించాలని మార్గనిర్దేశర చేశారు. పెద్ద పెద్ద కాన్వాయ్ వాహనాల్లో వెళ్లటం అందరికీ చాలా పెద్ద ఫ్యాషన్‌గా మారిందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. కాన్వాయ్ వాహనాల సంఖ్య తగ్గించి ప్రజాప్రతినిధులు ఆదర్శంగా నిలవాలని.. సెక్యూరిటీని కూడా కుదించుకోవాలని సూచించారు. విదేశీ పర్యటనలు తగ్గించుకోవాలని ప్రధాని మోదీ సూచించారని.. దీనిని కూడా మనం పాటిద్దామని పిలుపునిచ్చారు. మన దేశంలో, రాష్ట్రంలోనూ మంచి పర్యాటక ప్రాంతాలున్నాయని వివరించారు. ప్రజలు విదేశాలకు వెళ్లడం కంటే మన పర్యాటక ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. 'నాదేశం- నా బాధ్యత' అనే ఆలోచనను ప్రజలంతా ఆచరించాలని అన్నారు. రెండు రోజుల్లో ఈ విషయంపై చర్చించి స్పష్టమైన ప్రకటన చేస్తామని తెలిపారు. బంగారం కొనడాన్ని కూడా తగ్గించాలని ప్రధాని చెప్పారని ప్రస్తావించారు. దీనిపైనా ప్రజలు ఆలోచన చేయాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# పుదుచ్చేరి సీఎంగా రంగస్వామి ప్రమాణం

మొదటి పేజి తరువాయి..

రంగస్వామి మాట్లాడారు. ఎన్డీయే కూటమికి మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిపై మరింతగా దృష్టి సారిస్తుందని, ప్రజా సంక్షేమం కోసం అవసరమైన అన్ని పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. పుదుచ్చేరిని ప్రధాన అభివృద్ధి, పర్యాటక కేంద్రంగా మార్చనున్నట్లు కూడా ఆయన తెలిపారు. పుదుచ్చేరిని సింగపూర్‌లా అభివృద్ధి చేయబోతున్నట్లు సీఎం రంగస్వామి ప్రకటించారు. పుదుచ్చేరిలో ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంపై ఎక్స్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ప్రమాణ స్వీకారం చేసిన ముఖ్యమంత్రి, మంత్రులకు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టు పెట్టారు. 'పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఎన్.రంగస్వామికి అభినందనలు. అక్కడ అభివృద్ధి ప్రస్థానాన్ని బలోపేతం చేసిన అనుభవజ్ఞుడైన, సమర్థవంతమైన పరిపాలకుడిగా ఆయన తనదైన ముద్ర వేశారు. కొత్త మంత్రులు పురోగతికి దోహదపడతారని, అక్కడి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తారని విశ్వాసం వ్యక్తం చేస్తున్నాను' అని మోదీ పోస్టు చేశారు. 30 స్థానాలున్న పుదుచ్చేరి అసెంబ్లీకి ఇటీవల ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి మెజారిటీ సీట్లు గెలుచుకుంది. ఈ కూటమిలో సీఎం రంగస్వామికి చెందిన ఆల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ 12 స్థానాలు గెలుచుకోగా, బీజేపీ 4 స్థానాలను కైవసం చేసుకుంది. ఏఐఏడీఎంకే, ఎల్జేకే చెరో స్థానాన్ని దక్కించుకున్నాయి. మరోవైపు ప్రతిపక్షాలైన డీఎంకే 5 స్థానాలు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఒక స్థానం గెలుచుకున్నాయి. ఇక, విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం రెండు స్థానాలతో ఖాతా తెరిచింది.

# నీట్‌ను పూర్తిగా రద్దు చేయాలి

మొదటి పేజి తరువాయి..

తమిళనాడు వ్యతిరేకించిన అంశాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ పరీక్షతో గ్రామీణ ప్రాంతాలు, ప్రభుత్వ పాఠశాలలు, తమిళ మాధ్యమానికి చెందిన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో 12వ తరగతి మార్కుల ఆధారంగా సీట్లను భర్తీ చేసేందుకు రాష్ట్రాలకు అనుమతి ఇవ్వాలని కేంద్రానికి సీఎం విజయ్ విజ్ఞప్తి చేశారు. నీట్ రద్దు చేయడం ద్వారా రాష్ట్రాలకు స్వేచ్ఛ ఇవ్వాలన్నారు.

# బంగారం, వెండిలపై కస్టమ్స్ డ్యూటీ పెంపి

మొదటి పేజి తరువాయి..

ముగిసిన త్రైమాసికంలో గోల్డ్ ఆధారిత ఎక్స్‌చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లో పెట్టుబడులు గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 186 శాతం మేర పెరిగాయి. కస్టమ్స్ డ్యూటీ పెంపుతో బంగారం, వెండికి డిమాండ్ తగ్గే అవకాశం ఉంది. ఇప్పటికే ధరలు అధికంగా ఉన్నందున కస్టమ్స్ డ్యూటీ పెంపుతో బంగారం, వెండికి డిమాండ్ తగ్గవచ్చని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. బంగారం,

వెండి దిగుమతుల కట్టడి కోసం ఇటీవల ప్రభుత్వం 3 శాతం ఐజీఎస్‌టీ విధించింది. దీంతో, బ్యాంకులు దిగుమతులకు దాదాపు నెల రోజుల పాటు బ్రేక్ చెప్పాయి. ఫలితంగా ఏప్రిల్‌లో దిగుమతులు 30 ఏళ్ల నాటి కనిష్ఠాన్ని తాకాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులను తట్టుకునేందుకు దేశ ప్రజలు పొదుపు చర్యలు పాటించాలని ప్రధాని మోదీ ఆదివారం పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.

# ఎయిర్ ఇండియా సంచలన నిర్ణయం

మొదటి పేజి తరువాయి..

అంతర్జాతీయ మార్గాల్లో విమానాలను నిలిపివేస్తున్నట్లు ఓ ప్రకటన జారీ చేసింది. ఢిల్లీ-చికాగో, ముంబై-న్యూయార్క్, ఢిల్లీ-షాంఘై, చెన్నై-సింగపూర్, ముంబై-ఢాకా, ఢిల్లీ-మాలే రూట్లలో సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు పేర్కొంది. ఈ నిర్ణయం జూన్ నుంచి ఆగస్టు మధ్యకాలంలో అమలులో ఉంటుందని తెలిపింది. నష్టాల దృష్ట్యా ఇప్పటికే కొన్ని మార్గాల్లో సర్వీసులను ఎయిర్ ఇండియా తగ్గించింది. ఆ నిర్ణయాన్ని మరికొన్ని రూట్లకు విస్తరిస్తూ తాజాగా ప్రకటన జారీ చేసింది. దీని ప్రకారం ఎయిర్ ఇండియా సంస్థ ప్రతి నెలా 1,200కు పైగా అంతర్జాతీయ విమాన సర్వీసులను నడపనుంది. వీటిలో ఉత్తర అమెరికాకు వారానికి 33, ఐరోపాకు 47, యూకేకు 57, ఆస్ట్రేలియాకు 8, ఫార్ ఈస్ట్, ఆగ్నేయాసియా, సార్క్ ప్రాంతాలకు 158 విమానాల చొప్పున నడవనున్నాయి. అలాగే మారిషస్‌కు వారానికి ఏడు విమాన సర్వీసులు ఉన్నట్లు పేర్కొంది. కాగా, నష్టాల దృష్ట్యానే ఎయిర్ ఇండియా సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# విశ్వాస పరీక్షలో నెగ్గిన విజయ్

మొదటి పేజి తరువాయి..

రిక్కి రాధన్ పండిట్ వెట్రివేల్‌ను నియమించడంపై పలు పార్టీల నుంచి వ్యతిరేకత ఎదురైంది.

అంతకుముందు చర్చ సందర్భంగా శాసనసభలో ఒకింత గందరగోళం నెలకొంది. అన్నాడీఎంకే అధినేత, మాజీ సీఎం పళనిసామి మాట్లాడుతూ.. విజయ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. తమ ఎమ్మెల్యేలకు ఆయన డబ్బులు ఆఫర్ చేశారని ఆరోపించారు. బలపరీక్షకు ముందు తమ పార్టీ ఎమ్మెల్యేలను సీఎం కలవడం సమంజసం కాదని పేర్కొన్నారు. అన్నాడీఎంకే పార్టీ ఐక్యంగానే ఉందని.. తమ ఎమ్మెల్యేలంతా విజయ్‌కు వ్యతిరేకంగా ఓటేస్తారని పళనిస్వామి తెలిపారు. అయితే, ఈ వ్యాఖ్యలను అన్నాడీఎంకే రెబల్ వర్గం ఎమ్మెల్యేలు ఖండించారు. తామంతా విజయ్‌కే మద్దతిస్తామని రెబల్ వర్గం నేత వేలుమణి స్పష్టంచేశారు.

ఇక చర్చలో డీఎంకే ఎమ్మెల్యే ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ విజయ్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'ఈ రాష్ట్రానికి రియల్ ప్రభుత్వం కావాలి. రీల్ ప్రభుత్వం కాదు. టీవీకే ప్రభుత్వానికి మెజార్టీ లేదు. మా కూటమిలోని పార్టీలు ఇప్పుడు మద్దతివ్వడం వల్లే విజయ్ గట్టెక్కగలుగుతున్నారు. ప్రభుత్వ ఏర్పాటు కోసం ఎమ్మెల్యేల కొనుగోళ్లకు పాల్పడ్డారు. దీనివల్ల రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతింటోంది' అని ఉదయనిధి విమర్శించారు. విజయ్‌ను రాష్ట్రంలో మెజారిటీ ప్రజలు తిరస్కరించారని అన్నారు. విశ్వాసపరీక్ష సందర్భంగా అన్నాడీఎంకే మద్దతును కొనుగోలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయని అన్నారు. ఇప్పటివరకూ డీఎంకే అమలు చేసిన పథకాలను కొనసాగించాలని కూడా డిమాండ్ చేశారు. అనంతరం బలపరీక్ష ఓటింగ్‌లో తాము పాల్గొనబోమంటూ సభ నుంచి డీఎంకే సభ్యులు వాకౌట్ చేశారు.

234 శాసనసభ స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ 108 స్థానాల్లో గెలుపొందింది. ఇందులో విజయ్ రెండుచోట్ల పోటీ చేశారు. డీఎంకే 59, అన్నాడీఎంకే 47 చోట్ల గెలుపొందింది. కాంగ్రెస్ 5, పీఎంకే 4, ఐయూఎంఎల్ 2, సీపీఐ 2, వీసీకే 2, సీపీఎం 2, భాజపా 1, డీఎండీకే 1, ఏఎంఎంకే 1 చోట విజయం సాధించాయి.

-------------

# అమరావతితో పాటే విశాఖ అభివృద్ధి

మొదటి పేజి తరువాయి..

మారబోతోంది. రాయలసీమ 'టెక్నాలజీ హబ్'గా తయారవుతోంది. తిరుపతిలో ఏరో స్పేస్ సిటీ, కర్నూలులో డ్రోన్ సిటీ ఏర్పాటు కాబోతున్నాయి. శ్రీసిటీ.. ఇండస్ట్రియల్ హబ్‌గా తయారైందని వివరించారు. ఇకపోతే కిమ్స్ అధినేత భాస్కర్‌రావు ఒక విజన్ ఇచ్చారు. 2027 మే 13న కిమ్స్ ఆసుపత్రిని ప్రారంభిస్తాం అన్నారు. 2028 ఆగస్టు 15 కంటే ముందే విశాఖలో గూగుల్ తన కార్యకలాపాలు ప్రారంభిస్తుంది. 2028 డిసెంబరులోపు ఫేజ్-1 పూర్తి చేయాలని ఆర్సెల్లార్ మిత్తల్‌కు ఆదేశాలు ఇచ్చాం. ఎలాంటి అనుమతులు కావాలన్నా త్వరగా ఇస్తాం. లక్ష మందికి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తాం. వైద్యులు కూడా ఏఐని నేర్చుకుంటున్నారు. లక్ష మందికి ఉద్యోగాలు ఇవ్వాలనేదే మా ప్రభుత్వ ఆలోచన. ప్రపంచంలో ప్రతి ముగ్గురు వైద్యుల్లో ఒకరు ఇక్కడి నుంచే ఉండాలి. డిసెంబరు నాటికి భారత్‌లో క్వాంటం కంప్యూటింగ్‌కు చిరునామాగా అమరావతి అవుతుందని చంద్రబాబు అన్నారు. విదేశాలపై ఆధారపడకుండా గ్రీన్ ఎనర్జీని మన రాష్ట్రంలోనే ఉత్పత్తి చేసుకునేలా కార్యాచరణ రూపొందిస్తున్నాం. ప్రతి పొలంలో, ఇంటిపైనా సోలార్ రూఫ్‌టాప్ లాంటి విద్యుదుత్పత్తి కేంద్రాలు తీసుకొస్తాం. పశ్చిమాసియా యుద్ధం వల్ల పెట్రోల్, గ్యాస్, డీజిల్ కొరత వచ్చింది. భవిష్యత్తులో వర్క్‌ఫ్రమ్ హోం వస్తుంది.. ప్రభుత్వంలో కూడా తీసుకొస్తాం. 10 కార్లతో కాన్వాయ్‌గా రావడం ఫ్యాషనైంది..

సెక్యూరిటీ అర్థవంతంగా ఉండాలి. హాలిడే వస్తే విదేశాలకు వెళు_న్నారు. మంచి పర్యాటక ప్రదేశాలు మన దేశంలోనే ఉన్నాయి. అరకు, పాపికొండలు, గండికోట వంటి ప్రదేశాలు మన రాష్ట్రంలో ఉన్నాయి. గోవాను మించిన టూరిజం కేంద్రంగా సూర్యలంక మారుతుందని సీఎం అన్నారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# చమురు సంక్షోభంతో పొదుపు మంత్రం

మొదటి పేజి తరువాయి..

కథనాలు వెలువడ్డాయి. అంతేకాకుండా, విద్యుత్ కార్ల వినియోగాన్ని పెంచాలని కూడా ప్రధాని సూచించినట్టు తెలుస్తోంది. మీడియా కథనాల ప్రకారం, కాన్వాయ్‌లోని కార్ల సంఖ్యను 50 శాతం మేర తగ్గించాలని ప్రధాని భద్రత దళం స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్‌కు (ఎస్పీజీ) ఆదేశాలు అందాయి. భద్రతా ప్రొటోకాల్ పాటిస్తూనే పొదుపు చర్యలు చేపట్టాలని ఎస్పీజీకి సూచనలు వెళ్లినట్టు సమాచారం. ఈ దిశగా ఎస్పీజీ కార్యాచరణ మొదలెట్టినట్టు కూడా తెలుస్తోంది. తన కాన్వాయ్‌లో విద్యుత్ కార్ల సంఖ్యను పెంచేందుకు కూడా చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ సూచించినట్టు తెలుస్తోంది. ఇందుకోసం ప్రస్తుతం అందుబాటులో ఉన్న కార్లనే వినియోగించాలని, కొత్తవి కొనవద్దని కూడా ప్రధాని స్పష్టం చేసినట్టు సమాచారం. ఇకపోతే హోంమంత్రి అమిత్ షా కూడా తన కాన్వాయ్‌లో వాహనాలను తగ్గించుకున్నట్లు వెల్లడించారు. ఇప్పుడున్న కాన్వాయ్‌లో దాదాపు సగం వరకు తగ్గించారని సమాచారం. ఇతర ప్రభుత్వ శాఖలు కూడా ఈ తరహా పొదుపు చర్యలకు సమాయత్తం అవుతున్నట్టు తెలుస్తోంది. ఇంధన పొదుపు కోసం ఏయే చర్యలు తీసుకోవాలనే దానిపై పలు శాఖలు సమీక్షలు జరుపుతున్నాయి. ఇక మధ్యప్రదేశ్, రాజస్థాన్ సీఎంల కాన్వాయ్ కుదింపునకు కూడా సన్నాహాలు జరుగుతున్నట్టు సమాచారం.

# పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యం

మొదటి పేజి తరువాయి..

ఉపయోగించాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలను కోరారు. బంగారం కొనుగోళ్లను ఏడాది పాటు వాయిదా వేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే బంగారంపై కస్టమ్స్ సుంకాన్ని 6 నుంచి 15 శాతానికి కేంద్రం పెంచింది. దీంతో బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. గత కొంతకాలంగా చమురు ధరలూ పెంచుతారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో గవర్నర్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# అత్యవసరంగా గన్నవరంలో దిగిన ఇండిగో

విజయవాడ,మే13 (ఆర్ఎన్ఎ):గన్నవరం ఎయిర్‌పోర్టులో పుణె ఇండిగో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్ అయింది. పుణె నుంచి హైదరాబాద్‌కు 187 మంది ప్రయాణికులతో విమానం బయలుదేరింది. అయితే, హైదరాబాద్ విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యేందుకు పరిస్థితులు అనుకూలించలేదు. దీంతో ఎయిర్‌పోర్టు పరిసర ప్రాంతాల్లో చాలా సేపు గాలిలోనే చక్కర్లు కొట్టింది ఇండిగో విమానం. అయినా, వాతావరణ పరిస్థితులు ఏమాత్రం అనుకూలించకపోవడంతో పైలట్ విమానాన్ని గన్నవరం విమానాశ్రయం వైపునకు మళ్లించారు. అక్కడికి చేరుకున్న అనంతరం అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఏం జరుగుతుందో అర్థం కాని ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. చివరికి సురక్షితంగా విమానం కిందకు దిగడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా, సుమారు రెండు గంటలుగా గన్నవరం ఎయిర్‌పోర్టు రన్‌వేపైనే పుణె ఇండిగో విమానాన్ని అధికారులు నిలిపివేశారు.

# పోలీసుల విచారణకు భగీరథ్ గైర్హాజరు

హైదరాబాద్,మే13(ఆర్ఎన్ఎ): కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్.. పోలీసుల విచారణకు గైర్హాజరయ్యారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అయ్యింది. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం ఈ కేసును విచారిస్తోంది. ఇందులో భాగంగా విచారణకు రావాల్సిందిగా భగీరథ్‌కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు పోలీసుల ముందు విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే సమయం గడిచినప్పటికీ భగీరథ్.. పోలీసుల విచారణకు హాజరుకాలేదు. ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో పలు సెక్షన్లను పోలీసులు జోడించారు. బాధితురాలి నుంచి రెండో సారి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. తాజాగా నిందితుడిపై తీవ్రమైన లైంగిక దాడి, ముందుగా ప్లాన్ చేసి లైంగిక చర్యలకు పాల్పడినట్లు సెక్షన్ 5 (ఐ)ను కూడా పోలీసులు జతపరిచారు. మరోవైపు ముందస్తు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టులో బండి భగీరథ్ పిటిషన్ వేశారు. గురువారం ఈ పిటిషన్‌పై హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ చేయనుంది.

# రొయ్యల ఫీడ్ ధరలో ఆక్వా రైతుల కుదేలు

మొదటి పేజి తరువాయి..

ఫీడ్ ధరల పెరుగుదల వల్ల రైతులపై పడుతున్న భారం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా రైతుల ఇబ్బందులపై కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు లేఖ రాశారు. అలాగే, ముడి పదార్థాల ధరలను నియంత్రించేందుకు కేంద్రం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఆక్వా రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఫీడ్ ధరల పెరుగుదల కారణంగా రైతుల పెట్టుబడి వ్యయం గణనీయంగా పెరిగిందని, ఒక్కో టన్ను ఫీడ్‌పై సుమారు రూ.25 వేల వరకు అదనపు భారం పడుతోందని లేఖలో పేర్కొన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రొయ్యల సాగు తగ్గే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దేశీయ అవసరాలకు సరిపడా ముడి పదార్థాల లభ్యత ఉండేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని చంద్రబాబు కోరారు. సోయాబీన్ మీల్, సోయా ఆయిల్ దిగుమతులపై సడలింపులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ల్గ÷తులకు అందుబాటు ధరల్లో రొయ్యల ఫీడ్ లభించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు కోరారు. అలాగే, ఫీడ్ ధరల పర్యవేక్షణ కోసం ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేయాలని సూచించారు. ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తన లేఖలో పేర్కొన్నారు.

# కళ్లాల సౌకర్యం లేక రైతులకు నష్టం


- అకాల వర్షంతో తడిసి ముద్దవుతున్న ధాన్యం
- తక్కువ ధరలకు దళారులకు అమ్ముకునే దుస్థితి

**కాకినాడ,మే13 :** ధాన్యాన్ని ఆరబోసుకునేందుకు కళ్లాల సౌకర్యం లేకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రధాన రహదారుల వెంబడి కొంతమంది రైతులు ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. 17 శాతం తేమ ఉండాలనే రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. సుమారు నాలుగు రోజుల పాటు ఎండలో ధాన్యాన్ని ఆరబోయాల్సి వస్తోంది. ఇటీవల రెండుసార్లు కురిసిన వర్షాలకు ధాన్యం తడిసిపోయింది. దీంతో, పచ్చి ధాన్యాన్ని దళారులకే తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. 75 కిలోల సాధారణ రకానికి రూ.1,725, 'ఎ' గ్రేడ్ రకానికి రూ.1,740 మద్దతు ధర ఇవ్వాలి. దళారులు కొన్ని ప్రాంతాల్లో 1250 నుంచి రూ.1300, మరికొన్ని ప్రాంతాల్లో రూ.1,400 మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దీంతో, బస్తాపై రైతులు రూ.300 నుంచి రూ.400 వరకూ నష్టపోయారు. దళారికి 75 కిలోల బస్తా రూ.1,400కు అమ్ముకోవాల్సి వచ్చిందని వాపోయారు. 70 శాతం మంది ఈ విధంగానే ధాన్యాన్ని అమ్ముకున్నారని తెలిపారు. ప్రభుత్వం సకాలంలో కొనుగోలు పక్రియ ప్రారంభించలేదు. తేమ శాతం నిబంధన వంటి కారణాల వల్ల వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. 75 కిలోల బస్తాను రూ.1,400 కే ఇచ్చేయాల్సి వచ్చిందని వాపోయారు. ధాన్యం కొనుగోళ్లలో దళారుల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. దీంతో, మద్దతు ధర లభించక అన్నదాతలు నష్టపోతున్నారు. కాకినాడ జిల్లాలో ఇప్పటికే 90 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వచ్చింది. ఇందులో ప్రభుత్వం కొన్నది 1.30 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే. ఈ ఏడాది రబీలో ఎకరాకు సుమారు 45 బస్తాల దిగుబడి వచ్చింది. కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తున్న ధాన్యాన్ని నిబంధనల పేరుతో తిరస్కరిస్తుండడం, మేఘాలు, వర్షాలు భయపెడుతుండడంతో రైతులు గత్యంతరంలేని పరిస్థితుల్లో దళారులను తెగనమ్ముకోవాల్సి వస్తోంది. ఈ ఏడాది రబీ సీజన్లో కాకినాడ జిల్లాలో 1.87 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. 6.76 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకూ 1.65 లక్షల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. సుమారు ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయ్యింది. ఇందులో 1.30 లక్షల మెట్రిక్ టన్నుల (21.67 శాతం) ధాన్యాన్ని మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసింది. 3.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని దళారులు కొనుగోలు చేశారు. మిగిలిన ధాన్యం కళ్లాల్లోనే ఉంది. వాతావరణ పరిస్థితులు భయపెడుతున్న నేపథ్యంలో వరి కోత, నూర్పిడి పనులను 95 శాతం మేర యంత్రాల ద్వారానే పూర్తి చేస్తున్నారు.

# సీబీఎస్ఇ 12వ తరగతి ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థుల జయకేతనం

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మే 13 , (చట్టం బ్యూరో) :** చక్కటి ప్రణాళికల ద్వారా మరియు సరైన పద్ధతిలో సమీక్ష నిర్వహణ ద్వారా విద్యార్థులచే విజయాలను సులభంగా సాధింప చేయవచ్చని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి గారు స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ ప్రాంగణంలో అల్ఫోర్స్ సీబీఎస్ఈ సీనియర్ సెకండరీ పాఠశాలకు చెందినటువంటి విద్యార్థులు నేడు ప్రకటించిన 12వ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించడం పట్ల నిర్వహించినటువంటి ప్రత్యేక అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అత్యుత్తమ ప్రమాణాలు పాటించడమే కాకుండా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందినటువంటి అధ్యాపకులచే బోధన అందిస్తూ అగ్రగామిగా నిలుపుతున్నామని వారు సంతోషం వ్యక్తం చేశారు. అన్ని విభాగాల్లో పై చేయి సాధించడం మరియు ఇప్పటివరకు ప్రకటించినటువంటి అన్ని రకాల పరీక్షల ఫలితాల్లో స్ఫూర్తిదాయకమైన మార్పులతో ఆదర్శంగా నిలిచినదని సంతోషం వ్యక్తం చేశారు.






7గురు విద్యార్థులు 460 పైగా సాధించారని మరియు 47 మంది విద్యార్థులు 400 మార్కులు పైగా సాధించడం చాలా గొప్ప విషయమని చెప్పారు.

**పిసీఎం విభాగం**

వి. శ్రేయాన్ రెడ్డి,475 మార్కులతో పాఠశాలలో ప్రథమ స్థానంలో నిల్చాడని, జి.చైత్ర 471 మార్కులు, ఎన్.రత్నప్రకాష్ 469 మార్కులు, బి.లిఖిత్ సాయి 461 మార్కులు, కే. ఐశ్వర్య 458 మార్కులు, హర్షఫ్ అర్మాన్ 456 మార్కులు, వి.సాయి హర్షిత్ 456 మార్కులు, బి రోహిత్ 455 మార్కులు, ఎన్.కావ్య డ జె.సరయు 450 మార్కులు మరియు తదితరులు మంచి మార్కులు సాధించారని హర్షం వ్యక్తం చేశారు

**పిసిబి విభాగం**

డి.రుత్విక్, 476 మార్కులు తో పాఠశాలలో ప్రధమస్థానంలో నిలిచాడని, పి.శృత్విక 472 మార్కులు, డి.శ్రేయన్ష్ 462 మార్కులు మరియు తదితరులు అత్యుత్తమ మార్కులు సాధించారని చెప్పారు అధ్యాపకుల యొక్క నిరంతర కృషితో మరియు తల్లిదండ్రుల యొక్క అమూల్యమైనటువంటి సహకారంతో ఈ అద్భుతమైన ఫలితాలు సాధ్యమవుతున్నాయని చెప్పారు.

గత 36 సంవత్సరాలుగా అల్ఫోర్స్ విద్యాసంస్థలు చాలా చక్కటి కార్యక్రమాలతో మరియు ప్రపంచ ప్రమాణాలను పాటింపచేస్తూ భారతదేశంలో గుర్తింపు పొందిన బోధనా సిబ్బందితో బోధిస్తూ అగ్రగామిగా ఉంటున్నామని వారు చెప్పారు

చాలా చక్కటి ఫలితాలు సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్చాలను డ స్కోర్ కార్డ్స్ అందజేసి అభినందించారు

ఈ కార్యక్రమంలో పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ ఫామ్ సాగు చేయండి

**ఆయిల్ ఫామ్ సాగుతో రైతులకు అధిక లాభాలు**

**రాయికల్ మే 13 చట్టం :** వరికి ప్రత్యాయంగా ఆయిల్ ఫామ్ సాగుతో రైతు సంపాదన స్థాయిని పెంచుతుందని ఉద్యానవన శాఖ అధికారి కే స్వాతి అన్నారు. బుధవారం రాయికల్ మండలంలోని కిష్టంపేట, ఆలూరు, వస్తాపూర్, బోర్నపెల్లి గ్రామాల్లో 2022-23 సంవత్సరంలో నాటిన ఆయిల్ ఫామ్ తోటలలో ఉద్యానవన శాఖ,లోహియా ఆయిల్ ఫామ్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ గెలల కోత చేపట్టారు. కిష్టంపేట, ఆలూరు, వస్తాపూర్ గ్రామంల్లో గెలల కోత కోశారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఉద్యానవన శాఖ అధికారి స్వాతి మాట్లాడుతూ రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ ఫామ్ పంటను సాగు చేయాలని, కోతుల బెడద ఉండదు, అకాల వర్షాలకు నష్టం వాటిల్లని పంటని అన్నారు. ప్రస్తుతం టన్ను గెలల ధర రూ. 23,500/- గా ఉందని, మొక్కలు మరియు డ్రిప్ సదుపాయంపై సబ్సిడీ కలదని అన్నారు.ఎకరానికి సంవత్సరానికి రూ. 4200/- చొప్పున 4 సంవత్సరాల వరకు నిర్వహణ ఖర్చులు చెల్లించబడునని తెలిపారు. ఆయిల్ ఫామ్ చట్టం ప్రకారం గెలల కొనుగోలు చేపట్టబడునని, రైతులు పక్వ దశకు వచ్చిన నారింజ రంగు గెలలనే కోయవలెనని ఉద్యాన అధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన విస్తరణాధికారి రాజేష్, లోహియా కంపెనీ క్లస్టర్ అధికారి రమేష్, క్షేత్ర సిబ్బంది రాజేష్, కుమార్ డ్రిప్ కంపెనీ సిబ్బంది సురేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



రాయికల్ మే 13 చట్టం

ఆయిల్ ఫామ్ సాగుతో రైతు సంపాదన స్థాయిని పెంచుతుందని ఉద్యానవన శాఖ అధికారి కే స్వాతి అన్నారు. బుధవారం రాయికల్ మండలంలోని కిష్టంపేట, ఆలూరు,వస్తాపూర్, బోర్నపెల్లి గ్రామాల్లో 2022-23 సంవత్సరంలో నాటిన ఆయిల్ ఫామ్ తోటలలో ఉద్యానవన శాఖ,లోహియా ఆయిల్ ఫామ్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ గెలల కోత చేపట్టారు.కిష్టంపేట గ్రామంలోని రైతులు చింతల రాజేశ్వరరెడ్డి తోటలో 6 క్వింటాళ్లు,తంగెళ్ళ గంగారాం తోటలో 8క్వింటాళ్ళు,ఆలూరు గ్రామంలోని రైతు ఎలిపెద్ది రాజు తోటలో 3 క్వింటాళు ృ,వస్తాపూర్ గ్రామంలోని రైతు నారాయణరెడ్డి తోటలో ఒక టన్ను,ఆయిల్ ఫామ్ గెలలు కోత కోశారు.ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఉద్యానవన శాఖ అధికారి స్వాతి మాట్లాడుతూ.... రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ ఫామ్ పంటను సాగు చేయాలని,కోతుల బెడద ఉండదు,అకాల వర్షాలకు నష్టం వాటిల్లని పంట.ప్రస్తుతం టన్ను గెలల ధర రూ. 23,500/- గా ఉందని,మొక్కలు మరియు డ్రిప్ సదుపాయంపై సబ్సిడీ కలదని అన్నారు.ఎకరానికి సంవత్సరానికి రూ. 4200/- చొప్పున 4 సంవత్సరాల వరకు నిర్వహణ ఖర్చులు చెల్లించబడునని,19993 ఆయిల్ ఫామ్ చట్టం ప్రకారం గెలల కొనుగోలు చేపట్టబడునని,రైతులు పక్వ దశకు వచ్చిన నారింజ రంగు గెలలనే కోయవలెనని ఉద్యాన అధికారి సూచించారు.ఈ కార్యక్రమంలో ఉద్యానవన విస్తరణాధికారి రాజేష్, లోహియా కంపెనీ క్లస్టర్ అధికారి రమేష్,క్షేత్ర సిబ్బంది రాజేష్, కుమార్ డ్రిప్ కంపెనీ సిబ్బంది సురేష్,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మిల్లుల్లో ధాన్యం అన్ లోడింగ్ వేగవంతం చేయాలి





- **కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి**
- **అదనపు కలెక్టర్ గడ్డం నగేష్**
- **వేములవాడ మండలంలో పలు రైస్ మిల్లులు, వేములవాడ, చందుర్తి, రుద్రంగి మండలాల్లోని కొనుగోలు కేంద్రాల తనిఖీ**

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మే 13 ,(చట్టం బ్యూరో) :** రైస్ మిల్లుల్లో ధాన్యం అన్ లోడింగ్ వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు.

వేములవాడ మండలం మల్లారం, మర్రిపల్లి, చందుర్తి మండలకేంద్రం, మల్యాల, మూడపల్లి, రుద్రంగిలోని కొనుగోలు కేంద్రాలు, వేములవాడ మండలం మర్రిపల్లిలోని మారుతి, మహాలక్ష్మి, మణికంఠ రైస్ మిల్లులను అదనపు కలెక్టర్ తనిఖీ చేసి, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు, రైస్ మిల్లుల యజమానులకు పలు సూచనలు చేశారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకువచ్చే ధాన్యాన్ని జాప్యం చేయకుండా తూకం వేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో అన్ని కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడానికి సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి వాహనాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలను, మిల్లులను అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు వాహనాల ద్వారా తరలించిన ధాన్యం బస్తాలను వేగంగా దింపుకొని, తిరిగి వాహనాలను కొనుగోలు కేంద్రాలకు పంపించేలా చూడాలని రైస్ మిల్లర్ల యజమానులను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. మిల్లులకు వచ్చిన ధాన్యం అన్ లోడ్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. తనిఖీలో రుద్రంగి, చందుర్తి తహసీల్దార్లు పుష్పలత, భూపతి అధికారులు ఉన్నారు.

# ఎస్ ఆర్ ఆర్ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో పాలీసెట్ విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్ల వితరణ

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మే 13 ,(చట్టం బ్యూరో ) :** విద్యార్థుల భవిష్యత్తు బంగారు భవిష్యత్తుగా మారాలని ఆకాంక్షిస్తూ, ఎస్ ఆర్ ఆర్ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులకు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని మజ్జిగ ప్యాకెట్లు మరియు చల్లని వాటర్ పంపిణీ చేయడం జరిగింది. ఈ మజ్జిగ ప్యాకెట్లను సంతోష్ కుమార్ దించడం జరిగింది. పరీక్ష కేంద్రాలకు వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా పరీక్ష రాయాలనే ఉద్దేశంతో ఈ చిన్న సహాయం చేయడం జరిగింది. సమాజ సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఎస్ ఆర్ ఆర్ హెల్పింగ్ హాండ్స్, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తుంది. వీరిని ఎస్ ఆర్ ఆర్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కల్వకుంట రామ కృష్ణ మరియు అధ్యాపకులు అభినందించారు. ఇందులో పాల్గొన్నవారు ఎస్.ఆర్.ఆర్ హెల్పింగ్ హాండ్స్ ఫౌండర్ వెంకటరమణ మరియు వినయ్ ,లోకేష్ మరియు తదితరులు ఉన్నారు.





# పిల్లలు లేని వారికి దత్తత ఒక వరం

- **జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
- **చిన్నారుల దత్తత కార్యక్రమం**





**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మే 13 ,(చట్టం బ్యూరో) :** పిల్లలు లేని వారికి దత్తత ఒక వరం లాంటిదని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం ఇద్దరు చిన్నారులను దత్తతకు అందించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. పిల్లలను చక్కగా చూసుకోవాలని చెప్పారు. ఎవరైనా చట్టబద్ధంగా సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ ద్వారా మాత్రమే ఆన్లైన్ ద్వారా పిల్లలను దత్తతకు ఎంపిక చేసుకోవాలని సూచించారు. అలాకాకుండా ఇతర అక్రమ మార్గాలలో చేసుకున్నట్లయితే ఐదు సంవత్సరాల జైలు శిక్ష లక్ష రూపాయల జరిమానా ఉంటుందని హెచ్చరించారు.

పిల్లలను పెంచే స్థోమత లేనటువంటి తల్లితండ్రులు తమ పిల్లల్ని దత్తత కోసం అప్పగించవచ్చని జిల్లా కలెక్టర్ సూచించారు. పిల్లలను రోడ్డు మీద వదిలి వేస్తున్న వారి తల్లిదండ్రులపైన జువైనల్ జస్టిస్ చట్టం ప్రకారము చర్య తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలను నిర్లక్ష్యం చేసినా, వదిలివేయడానికి ప్రోత్సహించిన వారికి కూడా చట్ట ప్రకారం జైలు శిక్ష జరిమానా ఉంటుందని స్పష్టం చేశారు.

. ప్రస్తుతం దత్తత కోసం చాలామంది ఎదురుచూస్తున్నారని, ఎవరికైనా పిల్లలు పెంచే శక్తి లేనట్లయితే, అవాంచిత గర్భం అయినప్పుడు, వద్దు అనుకున్నట్లయితే పిల్లలని ప్రభుత్వ శిశు సంరక్షణ కేంద్రాలకు అప్పగించాలని, వారిని చట్ట ప్రకారం దత్తతకు పంపిస్తామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. దత్తత తీసుకున్న తల్లిదండ్రులకు పిల్లల సంరక్షణ గురించి, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సూచనలు అందించారు. దీంతో ఆ పిల్లలకు మంచి జీవితాన్ని, వెలుగులు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు . సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, జిల్లా బాలల ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎన్ఐసీ ఎం గగన్ కుమార్ పాల్గొన్నారు.

# రామాంజనేయ యుద్ధం నాటక ప్రదర్శన



**కొడిమ్యాల, మే 13(చట్టం) :** హనుమాన్ పెద్ద జయంతిని పురస్కరించుకొని తారకరామ కళానిలయం కొడిమ్యాల వారి ఆధ్వర్యంలో మంగళవారం కొండగట్టు దేవస్థానం వద్ద రామాంజనేయుల యుద్ధం నాటక ప్రదర్శనను వైభవంగా నిర్వహించారు. ఈ నాటకంలో ముమ్మాడి హరికృష్ణప్రసాద్, గుగ్గిల హన్మయ్యచారి, ఏనుగు ఆదిరెడ్డి, నిజాం రాజన్న, కంచర్ల గంగాచారి, ఇనుగంటి సత్యానందం, వడ్లకొండ హనుమండ్లు, ముమ్మాడి శివానిలు పాత్రలు పోషించారు. అశేష జనవాహిని ఈ నాటకాన్ని తిలకించగా పలువురు భక్తులు తారకరామ కళానిలయం సభ్యులను అభినందించారు.

# ఘనంగా హిందూ వాహిని జిల్లా అధ్యక్షులు న్యాయవాది బెజ్జంకి శ్రీకాంత్ జన్మదిన వేడుకలు





**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మే 13,( చట్టం బ్యూరో) ;** కరీంనగర్ నగరంలో హిందూ వాహిని జిల్లా అధ్యక్షులు న్యాయవాది బెజ్జంకి శ్రీకాంత్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు . కరీంనగర్ బార్ అసోసియేషన్ లో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో పలు అనాథ ఆశ్రమాలలో అన్నదానం నిర్వహించి, పండ్ల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని పదవులు అలంకరించాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఆయన అభిమానులు పాల్గొన్నారు.

# ఎన్‌టిఎ వైఫల్యంతో విద్యార్థులకు శాపం !

కొందరు మాఫియాతో చేతులు కలపడం వల్లనే పేపర లీకేజీలు జరుగుతున్నాయి. వారిని గుర్తించాలి. కఠినంగా శిక్షించాలి. నీట్ పేపర్ దోషులకు కఠిన శిక్షలు పడితే తప్ప ఇలాంటి తప్పిదాలు పునరావృతం అవుతూనే ఉంటాయి. ఒకప్పుడు టెన్త్ లేదా ఇంటర్ పరీక్ష పేపర్లు లీక్ అయితే సంబంధిత మంత్రి రాజీనామా చేసేవారు. అంతగా నైతిక బాధ్యత వహించేవారు. కానీ నీట్ పేపర్ లీక్ కావడం లక్షల మంది విద్యార్థుల భవితవ్యాన్ని ప్రమాదంలో పడేసింది. దేశంలో వైద్య విద్య పట్టణ ప్రాంతాల్లోని ఎగువ మధ్యతరగతి, ఉన్నత వర్గాల వారికే అందుబాటులో ఉంది. సామాన్యులు వైద్య విద్య చదివించడం దాదాపు అసాధ్యమైన పరిస్థితి ఏర్పడింది. గతంలో ప్రతి రాష్ట్రం ఎంసెట్ నిర్వహించుకోవడంతో ఇలాంటి బాధలు ఉండేవి కావు. నీట్‌ను తమిళనాడు అస్సలు ఒప్పుకోలేదు. కానీ 2017లో మోడీ ప్రభుత్వం కేంద్రీకరణ విధానాల్లో భాగంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్‌టిఎను తీసుకొచ్చి, రాష్ట్రాల పరిధిలో ఉన్న వైద్య విద్య ప్రవేశార్హత నీట్ లో భాగం చేశారు. అన్ని పరీక్షలను తన చెప్పు చేతల్లో ఉంచుకోవాలన్న మోడీ ప్రభుత్వ విధానంతో లీక్ లు, అవకతవకలు షరా మామూలుగా మారిపోయాయి. నీట్ విధానం అన్యాయమని, ఈ విధానాన్ని రద్దు చేసి, వికేంద్రీకరించాలని దక్షిణాది రాష్ట్రాలు కేరళ, తమిళనాడు, కర్ణాటక అసెంబ్లీలో తీర్మానాలు చేశాయి. దాదాపు 400 మందితో ఏర్పడిన ఎన్‌టిఎ నీట్ సహా 46 పరీక్షలను సమన్వయం చేయాల్సి ఉండటం, అందులోనూ అనర్హులు, అక్రమార్కులు భాగస్వాములు కావడం వల్ల ఇవాళ నీట్ పరీక్ష రద్దుకు కారణమయ్యింది. గతంలో నాలుగు సార్లు నీట్, ఒకసారి యుజిసి నెట్ లీక్ కావడమే ఇందుకు నిదర్శనం. 2024లో నీట్ యుజి పరీక్ష అవకతవకలపై బీహార్‌లో అరెస్టులు, సకాలంలో పేపర్ ఇవ్వక పోవడం వల్ల గ్రేస్ మార్క్ లు ఇవ్వాల్సి రావడం సహా ఎన్నో అంశాలు కలకలం రేపాయి. చర్చనీయాంశం అయ్యాయి. పూర్తి భద్రతా ప్రోటోకాల్ పాటించామని, జిపిఎస్ ట్రాక్ చేసిన వాహనాలు, ఎ.ఐ నియంత్రిత సిసి టివి, బయోమెట్రిక్, 5 జి జామర్లు వంటి చర్యలు తీసుకున్నామని ఎన్‌టిఎ చెబుతున్నా అక్రమాలు జరుగుతున్నాయంటే పేపర్ లీక్ మాఫియాను అరికట్టడంలో వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. విద్యార్థుల కలలను భగ్నం చేసే పేపర్ లీక్ లను అడ్డుకోకపోగా, కనీసం నోరుమెదపని ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉండటం సిగ్గుచేటు. పరీక్షా పే చర్చ అంటూ విద్యార్థులతో చర్చించే ప్రధానికి ఏటా జరుగుతున్న పేపర్ లీక్ లపై కనీసంగా మాట్లాడడం లేదు. అవిశ్రాంతంగా శ్రమించి ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులు మరోసారి మానసిక ఒత్తిడి, తల్లిదండ్రులపై ఆర్థిక భారం, అనిశ్చితితో శిక్ష అనుభవిస్తున్నారు. వ్యవస్థ ఇన్ని లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటుంటే మోడీ ఇప్పుడు ఎందుకు మాట్లాడరన్నదే ప్రశ్న. నిజానికి నీట్ పరీక్షను తప్పించి ఆయా రాష్ట్రాలకు మునుపటి మాదిరి ఎంసెట్ నిర్వహించుకునే వెసలుబాటు కల్పిచడం మేలు. లేదా నీట్ వైఫల్యాలపై చర్యలు తీసుకోవాలి. సిబిఐ విచారణకు ఆదేశించినా అది ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది కూడా అనుమానమే. పేపర్ లీక్ పై కేంద్రప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలి. బాధ్యులకు కఠిన శిక్షలు పడేలా చేయాలి. విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడకుండా తక్షణ చర్యలు చేపట్టాలి. ఈ నెల 3వ తేదీన నిర్వహించిన నీట్ (యూజీ)-2026 పరీక్షను ఎన్‌టీఏ రద్దు చేసింది. పరీక్షను మళ్లీ నిర్వహించటం అనేక మంది విద్యార్థులకు, వారి కుటుంబాలకు ఇబ్బంది కలిగించే నిర్ణయమేనని చెప్పకతప్పదు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై సీబీఐ దర్యాప్తునకు కేంద్రం ఆదేశించింది. పరీక్ష రద్దు నేపథ్యంలో లక్షలాది మంది విద్యార్థులు మళ్లీ పరీక్ష రాయాల్సిన దుస్థితి నెలకొంది. సాధారణంగా ఈ అక్రమాలు గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోతుంటాయి. అయితే, ఈసారి ఏజెంట్లు ఒకర్ని మించి మరొకరు సొమ్ము చేసుకునే ఉద్దేశంతో విచ్చలవిడిగా పేపర్‌ను అమ్మటంతో ఈ వ్యవహారం బయటపడింది.ఇలా లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడం కేవలం కేంద్ర వైఫల్యంగానే చూడాలి. వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నేషనల్ ఎలిజబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) కుంభకోణాలకు ఆలవాలంగా మారడం గర్హనీయం. ఈ నెల 3న జరిగిన నీట్ యుజి 2026 పరీక్ష ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని తేలడంతో పరీక్షను రద్దు చేసి, సిబిఐ విచారణకు జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్‌టిఎ) ఆదేశించింది. పేపర్ లీక్, పరీక్ష రద్దుతో 22 లక్షల మంది విద్యార్థులు అనవసరమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. పరీక్షలకు 42 గంటల ముందే రాజస్థాన్‌లోని సీకర్‌లో వాట్సాప్ లో అందుబాటు లోకి వచ్చిన 'అంచనా పేపర్' లో కెమిస్ట్రీ, బయాలజీ విభాగాల్లో 120 నుంచి 140 ప్రశ్నలు నీట్ పరీక్షలో వచ్చాయంటే పరీక్ష నిర్వహణలో డొల్లతనం వెల్లడవుతుంది. ఈ పేపర్‌లోని ప్రశ్నలు ప్రిపేరైన విద్యార్థులు 720 మార్కుల్లో 600 వరకు స్కోర్ చేసి ఉండవచ్చన్నది నిపుణుల మాట. ఈ నెల 1 నుండి అంచనా పేపర్ అభ్యర్థులకు చేరిందని, రూ.20 వేల నుంచి రూ.2 లక్షల వరకూ విక్రయించారని అధికారులు గుర్తించి, పలువురు నిందితులను అరెస్టు చేశారు. ఏదేమైనా ఇలాంటి విషయాల్లో కేంద్రం కఠినంగా వ్యవహరించాల్సి ఉంది.

## భారీగా తగ్గిన ప్రధాని కాన్వాయ్ వాహనాలు

**ఇంధన పొదుపుకోసం రెండు కార్లతో మోడీ పయనం**

**ఢిల్లీవీధుల్లో కనిపించిన దృశ్యాలు**

**న్యూఢిల్లీ,మే13** : ప్రధాని మోదీ చెప్పినట్లుగానే తన భద్రతా కాన్వాయ్ కి సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. తన భద్రతా కాన్వాయ్ లో వాహనాల సంఖ్యను భారీగా తగ్గించారు. ఇంధనం పొదుపుకోసం తన కాన్వాయ్ లో 50 శాతం వాహనాలను తగ్గించాలని ఆదేశించిన కొద్దిగంటల్లో అమలు చేసారు. కేవలం రెండు కార్ల కాన్వాయ్ తో ప్రయాణం చేస్తున్నారు. ప్రధాని మోదీ కాన్వాయ్‌లో కేవలం రెండు వాహనాలు మాత్రమే కనిపించడం చర్చనీయాంశమైంది.ఢిల్లీ వీధుల్లో ప్రధాని మోదీ కాన్వాయ్ దృష్యాలు కనిపించాయి. వీటికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా సంక్షోభ పరిస్థితులు ఉన్నాయని.. ఏడాది పాటు పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఇంధన వినియోగాన్ని తగ్గించడం లక్ష్యంగా.. తన కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను 50 శాతం తగ్గించాలని ప్రధాని మోదీ ఆదేశించారు. ప్రధానికి భద్రతగా ఉండే స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ లోని కాన్వాయ్‌లో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్యను పెంచాలని ప్రధాన మంత్రి సూచించారు. ఇందు కోసం కొత్త వాహనాలను కొనొద్దని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, రాజస్థాన్ సీఎం భజన్ లాల్ శర్మ, ఎంపీ సీఎం మోహన్ యాదవ్‌లతో సహా ఇతర మంత్రులు కూడా తమ అధికారిక కాన్వాయ్‌లలో వాహనాల సంఖ్యను తగ్గించుకున్నారు. అనవసర ప్రయాణాలను తగ్గించాలని, జాతీయ వనరులను పరిరక్షించాలని ప్రధాని ఇటీవల పిలుపునిచ్చిన క్రమంలో బాధ్యతాయుతమైన ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడం, పరిపాలనాపరమైన పొదుపు చర్యలు చేపట్టడం వంటి విస్తృత ప్రయత్నాలలో భాగంగా ఈ చర్యను పరిగణిస్తున్నారు.

## పామిడిలో వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం

### ఆప్యాయంగా పలకరించిన వైఎస్ జగన్

### వివాహ రిసెప్షన్‌కు హాజరై దంపతులకు ఆశీస్సులు

అనంతపురం,మే13 (ఆర్ఎన్ఎ): కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ నేత, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ కుమారుడు చైతన్యమిత్ర, అనంతపురం జిల్లా పామిడికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత వీరాంజనేయులు కుమార్తె, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్‌పర్సన్ లిఖితలకు ఇటీవల వివాహమైంది. మంగళవారం పామిడిలో నిర్వహించిన వీరి రిసెప్షన్‌కు పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేశారు.

వధూవరులకు పుష్పగుచ్ఛం అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అక్కడికి భారీగా చేరుకున్న పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులకు అభివాదం చేశారు. అంతకు ముందు వేదిక ప్రాంతానికి వస్తుండగా దారిపొడవునా ప్రజలు పెద్ద సంఖ్యలో రోడ్డుకు ఇరువైపులా నిల్చొని 'జై జగన్' అంటూ నినాదాలు చేశారు. వారందరికీ వైఎస్ జగన్ చిరునవ్వుతో అభివాదం చేశారు. యువతతో కరచాలనం చేస్తూ, చిన్నారులను ముద్దాడుతూ ముందుకు సాగారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబశివారెడ్డితో పాటు పార్టీ నేతలు పలువురు వధూవరులను ఆశీర్వదించారు.

# బక్రీద్ సందర్భంగా ప్రత్యేక చర్యలు

- పశువుల అక్రమ రవాణాపై నిఘా
- రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 203 చెక్ పోస్టుల ఏర్పాటు
- ఘర్షణలు తలెత్తకుండా కఠిన చర్యలకు ఆదేశం
- అధికారులతో డిజిపి సివి ఆనంద్ వీడియో కాన్ఫరెన్స్



హైదరాబాద్,మే13 : ఈ నెల 27వ తేదీన జరిగే బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను పూర్తిగా నిరోధించాలని పోలీస్ అధికారులను డిజిపి సివి ఆనంద్ ఆదేశించారు. అలాగే సోషల్ మీడియాలో పుకార్లు పుట్టించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. తెలంగాణలో బక్రీద్ పండుగను పురస్కరించుకుని శాంతిభద్రతల పరిరక్షణెళి లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపడుతోందని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, పశుసంవర్ధక శాఖ సెక్రటరీ కే. ఇలంబర్తి తదితరులతో కలిసి డీజీపీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడారు. ముఖ్యమంత్రి స్థాయిలో జరిగిన చర్చలు, అనంతరం ఉప ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశ నిర్ణయాల మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. బక్రీద్ పండుగ ఇతర పండుగల కంటే అత్యంత సున్నితమైనదని, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా రెండు వర్గాల మధ్య ఘర్షణలు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఇటీవల పశువుల అక్రమ రవాణా ఘటనలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ అమలు కోసమే ఈ వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పశువుల రవాణా విషయంలో కౌ స్లాటర్ యాక్ట్-1977, ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్-1978, ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ-1960 చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో 52 అంతరాష్ట్ర చెక్ పోస్టులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 203 చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు డీజీపీ వెల్లడించారు. అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలను ముమ్మరం చేయాలని, ముఖ్యంగా రానున్న 15 రోజుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగే పశువుల సంతలపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులకు దిశానిర్దేశర చేశారు. చెక్ పోస్టుల వద్ద పశువుల రవాణాకు సంబంధించిన 'ఫిట్ టు ట్రాన్స్‌పోర్టేషన్', 'ఫిట్ టు స్లాటర్' వంటి ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, పండుగ ముగిసే వరకు ఈ తనిఖీలు నిరంతరాయంగా కొనసాగాలని ఆదేశించారు. శాంతిభద్రతల విషయంలో ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని డీజీపీ హెచ్చరించారు. పశువుల రవాణాపై ఎవరికైనా అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలే తప్ప, నేరుగా రోడ్లపైకి వచ్చి ఘర్షణ వాతావరణం సృష్టించకూడదని ఖురేషీలు, గోరక్షక బృందాలకు సూచించారు. నిబంధనలు మీరి రాద్ధాంతం చేసే వారిపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు సస్పెక్ట్ షీట్లు కూడా ఓపెన్ చేస్తామని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు రెండువర్గాల వారితో విడివిడిగా సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని కోరారు. పోలీస్, మున్సిపల్ పశుసంవర్ధక, రెవెన్యూ శాఖలు సమన్వయంతో వ్యవహరించాలని, ఇందుకోసం ప్రత్యేక వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకొని సమాచారాన్ని ఎప్పటికప్పుడు పంచుకోవాలని సూచించారు. సీజ్ చేసిన పశువులను సంరక్షించేందుకు తగిన విస్తీర్ణంలో క్యాటిల్ పాండ్‌లను ఏర్పాటు చేయాలని, అక్కడ పశువులకు అవసరమైన సౌకర్యాలు ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంచాలని, గందరగోళం సృష్టించేలా పోస్టులు పెట్టే వారిని స్టేషన్లకు పిలిపించి హెచ్చరించాలని చెప్పారు. గతంలో బక్రీద్ సందర్భంగా నమోదైన కేసులను దృష్టిలో ఉంచుకుని, ఈసారి ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని స్పష్టం చేశారు.

మున్సిపల్ అధికారులు బక్రీద్ పండుగ అప్రమత్తతో ఉన్నారని స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్ తెలిపారు. కౌ స్లాటర్ యాక్ట్, ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్, ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ చట్టాలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. పశుసంవర్ధక శాఖ సెక్రటరీ కె. ఇలంబర్తి మాట్లాడారు. పశువుల రవాణాకు సంబంధించిన సర్టిఫికెట్లను ఇచ్చేందుకు వెటర్నరీ డాక్టర్లను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో వెటర్నరీ డాక్టర్లు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ గోపీ, శాంతిభద్రతల డీజీపీ మహేశ్ ఎం భగవత్, ఐజీపీలు చంద్రశేఖర్ రెడ్డి, షానవాజ్ ఖాసిం, కార్తికేయ, ఇంటెలిజెన్స్ డీఐజీ భాస్కరన్ తదితరులు తగు సూచనలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, అన్ని జిల్లాల ఎస్పీలు, వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.

# నీట్ పేర్ లీక్‌లో సిబిఐ దూకుడు

- దేశంలో ఏకకాలంలో సోదాలు
- ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ప్రకటన

**న్యూఢిల్లీ,మే13** : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సీబీఐ అధికారులు దర్యాప్తులో కీలక మలుపు చోటుచేసుకుంది. నీట్ యూజీ-2026 పేపర్ లీక్ కేసులో సీబీఐ తన దర్యాప్తును మరింత వేగవంతం చేసింది. ఈ కేసులో ఇప్పటి వరకు ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు సీబీఐ అధికారికంగా ప్రకటించింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఒకేసారి సోదాలు నిర్వహిస్తోంది. ఈ లీకేజ్ వెనుక ఉన్న ప్రధాన ముఠాను బయటకు తీసుకురావడానికి అధికారులు కృషి చేస్తున్నారు. నీట్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన కలిగించింది. ఈ నేపథ్యంలో సీబీఐ ప్రత్యేక బృందాలు రాజస్థాన్, హరియాణా, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాయి. సోదాల సమయంలో అనేక ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, డాక్యుమెంట్లు, బ్యాంక్ లావాదేవీలకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సీబీఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ కేసులో ప్రశ్నాపత్రం లీక్, మధ్యవర్తుల వ్యవస్థ, భారీ మొత్తాల్లో డబ్బుల లావాదేవీలు జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు లభించాయి. ఈ వ్యవహారంలో పరీక్షకు ముందుగానే కొందరు అభ్యర్థులకు ప్రశ్నాపత్రం అందించినట్లు అనుమానిస్తున్నారు.

సీబీఐ అధికారులు ఇప్పటివరకు ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. వీరిలో ముగ్గురు రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందినవారు కాగా, ఒకరు హరియాణాలోని గురుగ్రామ్‌కు చెందిన వ్యక్తి. మరొకరు మహారాష్ట్ర లోని నాసిక్ ప్రాంతానికి చెందినవారు. అరెస్టయిన వ్యక్తులు ప్రశ్నాపత్రం సేకరణ, పంపిణీ, అభ్యర్థులతో సంబంధాలు ఏర్పరచడం వంటి కీలక కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. వీరిని కోర్టులో హాజరుపరిచి కస్టడీకి తీసుకుని సమగ్రంగా విచారిస్తున్నారు. రాజస్థాన్ రాష్ట్రంలోని జమ్వా రామ్‌గఢ్ ప్రాంతానికి చెందిన మంగీలాల్, దినేశ్ బివాల్ సోదరులను సీబీఐ అధికారులు బుధవారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఈ ఇద్దరు ఈ పేపర్ లీక్ వ్యవహారంలో ప్రధాన మధ్యవర్తులుగా వ్యవహరిం చినట్లు అనుమానిస్తున్నారు. వారి ఇళ్లలో నిర్వహించిన సోదాల్లో పలు డిజిటల్ ఆధారాలు, బ్యాంక్ ఖాతాల వివరాలు, అభ్యర్థుల జాబితాలు లభించినట్లు సమాచారం. వీరి ద్వారా మరికొందరు అనుమానితుల వివరాలు కూడా సీబీఐకి లభించినట్లు తెలుస్తోంది. రాజస్థాన్‌లో సోదాలు కొనసాగుతుండగానే మహారాష్ట్రలో కూడా సీబీఐ తన దర్యాప్తును విస్తరించింది. అక్కడ ఇద్దరు మహిళలను అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ మహిళలు అభ్యర్థులు, మధ్యవర్తుల మధ్య సంబంధాలు ఏర్పరచడంలో కీలక పాత్ర పోషించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరి ఫోన్ కాల్ రికార్డులు, బ్యాంక్ లావాదేవీలు, సోషల్ మీడియా కమ్యూనికేషన్‌లను అధికారులు విశ్లేషిస్తున్నారు. ఈ వ్యవహారం అంతర్రాష్ట్ర నెట్‌వర్క్ ద్వారా నిర్వహించినట్లు సీబీఐ అధికారులు భావిస్తున్నారు. బుధవారం దేశవ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టింది. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు సహా పలు డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకుంది. ఢిల్లీలోని 'జాతీయ పరీక్షల సంస్థ' (ఎన్‌టీఏ) ప్రధాన కార్యాలయాన్నీ సందర్శించి.. రద్దయిన పరీక్షకు సంబంధించిన డాక్యుమెంట్స్‌ను సేకరించింది. ఈ పరీక్షా ప్రక్రియలో పాలుపంచుకున్న అధికారులతో సీబీఐ బృందం మాట్లాడినట్లు అధికారులు తెలిపారు. ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో.. ఈ నెల 3న నిర్వహించిన నీట్-యూజీ పరీక్షను ఎన్‌టీఏ రద్దు చేసిన విషయం తెలిసిందే.

------

# పొదుపు సూత్రాలు తెలంగాణకు నిధులు మాత్రం ఆంధ్రాకా ..?

- ప్రధాని తీరుపై మండిపడ్డ కవిత
- భగీరథ్ పారిపోకుండా లుకౌట్ నోటీసులు ఇవ్వాలని డిమాండ్



**హైదరాబాద్,మే13** : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చి పొదుపు సూత్రాలు చెప్పారని.. డబ్బులు మాత్రం ఏపీకి ఇచ్చారని తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యానించారు. బుధవారం మీడియాతో కవిత మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుటుంబ సభ్యులు ఆరోపణలు ఎదుర్కొంటున్నారని.. ప్రధాని సభా వేదికను బండి సంజయ్ పంచుకోకుంటే బాగుండేదని అన్నారు. ప్రధాని పర్యటనలో కేంద్ర మంత్రి పాల్గొనడం వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతం వెళ్లిందన్నారు. బండి సంజయ్ కుమారుడు దేశం దాటి పోకుండా తెలంగాణ పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేయాలని కవిత అన్నారు. బండి సంజయ్ కుమారుడు తప్పు చేసినట్లు రుజువు అయితే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆడపిల్ల జీవితం నాశనం అయ్యే విధంగా సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేసిన వారిని అరెస్ట్ చేయాలని.. సోషల్ మీడియా అకౌంట్స్ బ్లాక్ చేయాలన్నారు. బాధితురాలి వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయాల్సిన అత్యుత్సాహం బీఆర్ఎస్ పార్టీకి ఎందుకని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై ప్రధాని మోదీ మాట్లాడలేదని టీఆర్ఎస్ అధ్యక్షురాలు అన్నారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇవ్వాలన్నారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా కోసం కేంద్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు పోలవరం పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని కలిశారని.. పోలవరం ప్రాజెక్ట్‌ను 5 సార్లు సందర్శించారని తెలిపారు. కానీ తెలంగాణ సీఎం రేవంత్ ఇప్పటి వరకు ఒక్కసారి కూడా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు వెళ్లలేదని విమర్శించారు. ఏపీ నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటోందన్నారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే వాటర్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. చెక్ డ్యామ్‌లు కట్టి నీటి వనరులను సద్వినియోగం చేస్తామని తెలిపారు. ప్రధాని పర్యటనపై బీఆర్ఎస్ ఒక్క మాట మాట్లాడలేదని విమర్శించారు. ÷ఎలగణనలో ఓబీసీ కాలమ్ పెట్టాలని కవిత డిమాండ్ చేశారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించడానికి దేశం మొత్తం తిరుగుతామని చెప్పారు. పోలవరం, బనకచర్లపై రిట్ పిటిషన్ వేయనున్నట్లు కవిత తెలిపారు. దీనిపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి వినతి పత్రం ఇస్తామన్నారు. నీట్ లాంటి జాతీయ పరీక్ష పేపర్ల లీక్ ఘటన అంశాన్ని కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలన్నారు. విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడుకోవద్దని హెచ్చరించారు. టీఆర్ఎస్ జెండా పండుగలో తాను పాల్గొంటానని తెలిపారు. తెలంగాణ రాజకీయ శూన్యతను భర్తీ చేయడానికి తెలంగాణ రక్షణ సేన పుట్టిందని కవిత పేర్కొన్నారు.

## 15న ఆధారాలతో విచారణకు వస్తా

**పోలీసులకు బండి భగీరథ్ లేఖ**

హైదరాబాద్,మే 13 : పేట్ బషీరాబాద్ పోలీసులకు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ ఓ లేఖ పంపించారు. బుధవారం మధ్యాహ్నం పోలీసుల ఎదుట హాజరు కావాల్సి ఉన్నప్పటికీ, వ్యక్తిగత కారణాల నేపథ్యంలో మే 15వ తేదీన విచారణకు హాజరవుతానని తన లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు సిట్ అధికారులకు ఈమెయిల్‌తో పాటు అధికారిక లేఖను కూడా బండి భగీరథ పంపించారు. ఈ కేసులో విచారణకు హాజరయ్యే సమయంలో కీలక ఆధారాలు, సాక్ష్యాలతో వస్తానని ఆయన స్పష్టం చేశారు. అలాగే సిట్ అధికారుల దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరిస్తానని భగీరథ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో అవసరమైన సమాచారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. బండి భగీరథ పంపిన లేఖ ప్రస్తుతం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మే 15వ తేదీన జరగనున్న విచారణలో ఆయన సమర్పించే ఆధారాలు కీలకంగా మారే అవకాశం ఉంది. అయితే భగీరథ బెయిల్ కేసులో గురువారం 14న హైకోర్టులో విచారణ జరగాల్సి ఉంది.

# నీట్-2026 పేపర్ లీకేజీతో దేశ వ్యాప్తంగా 23 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం

- తెలంగాణ వ్యాప్తంగా 73 వేలమంది విద్యార్థుల జీవితాలతో చేలగాటం
- మాఫియాల చేతుల్లోకి పరీక్ష వ్యవస్థ!బాధ్యుల పై సిబిఐ పారదర్శకంగా విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలి
- పరీక్ష నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ను పూర్తిగా ప్రక్షాళన చేయాలి
- ఈర్ల రాంచెందర్ ఆల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్
- పెద్దపల్లి కార్యదర్శి


పెద్దపల్లి జిల్లా కార్యదర్శి ఈర్ల రాంచెందర్ కేంద్ర ప్రభుత్వం పై ఆగ్రహం వ్యక్తం చేసారు.

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మే 13 ,( చట్టం బ్యూరో ) :** దేశవ్యాప్తంగా 22 లక్షల మందికి పైగా విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న నీట్ పరీక్ష రద్దు కావడం కేవలం ఒక పరీక్ష వైఫల్యం మాత్రమే కాదు, ఇది దేశ పరీక్షా వ్యవస్థ ఎంతగా మాఫియాల చేతుల్లోకి వెళ్లిపోయిందో చూపించే ఘటన అని విద్యావేత్తలు, మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని 'డిజిటల్ ఇండియా', 'పారదర్శక పాలన' అంటూ కేంద్రం ప్రచారం చేసుకుంటున్నా, అత్యంత కీలకమైన ప్రవేశ పరీక్షల భద్రతను కాపాడటంలో మాత్రం పూర్తిగా విఫలమైందని ఆల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్

అనంతరం అయిన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కోట్లాది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే (NEET-2026) పరీక్షలో జరిగిన పేపర్ లీకేజీ ఘటన అత్యంత దారుణమైనదని , రాజస్థాన్‌లోని సికర్ ప్రాంతం నుంచి ఈ లీక్ నెట్‌వర్క్ బయటపడినట్లు సమాచారం వచ్చిందని,వాట్సాప్ , టెలిగ్రామ్ ద్వారా ప్రచారం అయ్యాయని, తర్వాత అసలు ప్రశ్నాపత్రంతో వాటిలో 100కు పైగా ప్రశ్నలు మ్యాచ్ అయ్యాయని ఆరోపణలు వచ్చాయని, పరీక్షలను సరిగ్గా నిర్వహించలేని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ను పూర్తిగా ప్రక్షాళన చేయాలని అయిన డిమాండ్ చేశారు.

దేశంలో ఇప్పటికే కార్పొరేట్ విద్యా వ్యవస్థ, కోచింగ్ మాఫియా భారంతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులపై ఇది మరో మోసపూరిత కుంభకోణం అని అన్నారు. పరీక్షకు ముందు ప్రశ్నాపత్రం బయటకు రావడం, అనేక ప్రశ్నలు అసలు పరీక్షతో సరిపోవడం, తదనంతరం పరీక్ష రద్దు వరకు వెళ్లడం దేశ పరీక్షా వ్యవస్థ పూర్తిగా వైఫల్యానికి గురైందని స్పష్టం చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) విద్యార్థుల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయాయన్నారు . పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు రాత్రనక, పగలనక కష్టపడి చదివి పరీక్షలు రాస్తుంటే, డబ్బు, అవినీతి, కోచింగ్ మాఫియా, రాజకీయ జోక్యంతో కొందరికి ప్రశ్నాపత్రాలు చేరడం అత్యంత ప్రమాదకర పరిస్థితి అని ధ్వజమెత్తారు.

ఇది కేవలం పేపర్ లీక్ కాదని, విద్యార్థుల భవిష్యత్తును అమ్ముకునే విద్యా వ్యాపార మాఫియా కుట్రలో భాగం అని ఆరోపించారు.

నీట్ -2026 పేపర్ లీకేజీపై సిట్టింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి పర్యవేక్షణలో సమగ్ర విచారణ ఉ సిబిఐ విచారణ జరపాలని, లీకేజీకి పాల్పడిన మాఫియా, మరియు అధికారులు, మధ్యవర్తులు, సంబంధిత సంస్థలపై కఠిన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, ఎన్టీఏ లో జరుగుతున్న అవినీతి, నిర్లక్ష్యం, ప్రైవేటీకరణ ధోరణులపై పూర్తిస్థాయి ప్రక్షాళన చేపట్టాలని, విద్యార్థుల మానసిక వేదన, ఆర్థిక నష్టానికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, భవిష్యత్తులో జాతీయ స్థాయి పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేలా బలమైన భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేయాలని, కోచింగ్ కార్పొరేట్ మాఫియాపై కేంద్ర ప్రభుత్వం కఠిన నియంత్రణలు విధించాలని డిమాండ్ చేసారు. తెలంగాణ రాష్టంలోనే 73వేల మంది విద్యార్థులు జీవితాలు పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఈ కుంభకోణం వెనక ఎంత పెద్దవాళ్ల హస్తం ఉన్నా, వాళ్లందరినీ పట్టుకుని కఠినంగా శిక్షించాలి, వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకరావాలని డిమాండ్ చేసారు.

సాధ్యమైనంత త్వరగా మళ్లీ నీట్ పరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించి విద్యార్థుల ఉన్నత భవిష్యత్తును కాపాడాలని అన్నారు.

నీట్ పేపర్ లీకేజీకి పూర్తి బాధ్యత వహించి కేంద్ర ప్రభుత్వం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఈర్ల రాంచెందర్ డిమాండ్ చేసారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయొద్దు

- చదువుల తల్లి స్థలం కోసం ఎంపీ అరవింద్ ధర్మదీక్ష
- జగిత్యాల బీజేపీ నియోజకవర్గ ఇంచార్జీ డాక్టర్ భోగ శ్రావణి



**రాయికల్ మే 13 చట్టం :** విద్యార్థుల భవిష్యత్తు కోసం నిజామాబాద్ ఎంపీ చేపట్టనున్న ధర్మదీక్షకు ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున మద్దతు ఇవ్వాలని కోరారు. రాయికల్ పట్టణంలో బుధవారం జగిత్యాల బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి భోగ శ్రావణి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నవోదయ పాఠశాల మరియు కేంద్రీయ విద్యాలయాలను కేటాయించిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయా విద్యాలయాల కోసం వెంటనే స్థలం కేటాయించాలని ఆమె డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం ముందుకు వచ్చి పాఠశాలలను మంజూరు చేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా స్థలం కేటాయించకుండా జాప్యం చేస్తోందని విమర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ కుట్రలతో విద్యార్థుల భవిష్యత్తును గాలికి వదిలేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల నియోజకవర్గంలో కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేపియాల్సిందిగా నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు శ్రీ అరవింద్ ధర్మపురి అడిగిన వెంటనే పిల్లల భవిష్యత్తు కోసం కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేపియడం జరిగింది. కానీ స్థలం కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. పక్కనే ఉన్న కోరుట్ల నియోజకవర్గంలో ఇప్పటికే నవోదయ పాఠశాల ప్రారంభమై అడ్మిషన్లు కూడా కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. జగిత్యాలలో కూడా సమయానికి స్థలం కేటాయించి ఉంటే ఇప్పటికి పాఠశాల ప్రారంభమై విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక నాయకుల నిర్లక్ష్యం వల్ల రెండు సంవత్సరాలుగా విద్యార్థులు నష్టపోతున్నారని, వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. విద్యాభివృద్ధిలో కూడా రాజకీయాలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఈ నెల 15వ తేదీ లోపు రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించాలని గడువు ఇచ్చామని, ఆలోపు చర్యలు తీసుకోకపోతే జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎంపీ ధర్మపురి అరవింద్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ధర్మదీక్షకు బీజేపీ రాష్ట్ర నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయనున్నారని తెలిపారు. జగిత్యాల నియోజకవర్గ ప్రజలు, రాయికల్ పట్టణం మరియు మండల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ భోగ శ్రావణి కోరారు. ఈ కార్యక్రమంలో రాయికల్ పట్టణ అధ్యక్షులు కుర్మా మల్లారెడ్డి, రాయికల్ మండల అధ్యక్షులు ఆకుల మహేష్, రాయికల్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కల్లెడ ధర్మపురి, 11వ వార్డ్ కౌన్సిలర్ పుల్లె శ్రీధర్, పాక్స్ చైర్మన్ ముత్యం రెడ్డి, కునారపు భూమేష్, రవీందర్ రెడ్డి, వేముల రాము, తోపారపు సురేష్, పటేల్ రాము, సామల్ల సతీష్, సింగని సతీష్, విజయ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధిహామీ కార్మికులకు రెండు వందల రోజుల పని కల్పించాలి

**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నాయిని శారధ**

**రాయికల్ మే 13 చట్టం :** ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి రెండు వందల రోజుల పని దినాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నాయిని శారధ కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. బుధవారం రాయికల్ మండల కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం కరపత్రాన్ని కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమే కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యవసాయంలోకి యంత్రాలు రావడంతో వ్యవసాయ కార్మికులకు పని దినాలు తగ్గిపోయాయని అన్నారు. దింతో ఉపాధి హామీ చట్టం తప్ప మరొక మార్గం లేదని అన్నారు. కొత్త వారికి జాబ్ కార్డులు ఇవ్వడం లేదని, ఊరు మారిన వారికి కార్డు మార్చడం లేదని, కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరును మార్చి వీబీ జీ రామ్ జీ కొత్త చట్టం తీసుకొచ్చారని, గతంలో 10శాతం రాష్ట్ర బడ్జెట్ బాధ్యత ఉంటె ఇప్పుడు 40శాతం పెంచడం జరిగిందని తెలిపారు. ఉపాధి కార్మికులకు చేసిన పనికి డబ్బులు ఆలస్యంగా ఇవ్వడం, ఎంత దూరం వెళ్లి పనులు చేసిన రవాణా ఖర్చులు ఇవ్వకపోవడం, కార్మికులకు గాయాలు అయితే నష్టపరిహారం కూడా ఇవ్వడం లేదని, గాయముతో పని చేయని దినాలు కూలీలకు ఇవ్వడం లేదని, భీమా పథకం అమలు లేదని, పొమ్మనలేక పొగ పెట్టినట్లు ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయుటకు బిజెపి కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తుందని అన్నారు. చట్టాన్ని కాపాడుటకు ఈనెల 15న అన్ని గ్రామాల్లో సమావేశాలు, నిరసనలు తెలుపాలని వీలైనంత ఎక్కువ ప్రచారముతో కార్మికులకు తెలియజేయాలని మన సంఘం పిలుపును ఇచ్చిందని, కార్మికులు సంఘటితంగా విజయవంతం చేయాలని కోరారు.

# ఎపిలో డిజిటల్ కనెక్టివిటీ పెంపు

## బిఎస్ఎస్ఎల్‌తో ఎపి ప్రభుత్వం ఒప్పందం
## హైస్పీడ్ ఇంటర్‌నెట్ సరఫరాతో గ్రామాలకు మేలు

న్యూఢిల్లీ,మే13 : ఆంధ్రప్రదేశ్‌లో డిజిటల్ కనెక్టివిటీని మరింత విస్తరించే దిశగా కీలక ముందడుగు పడింది. భారత్ నెట్ అమలుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం, బీఎస్ఎన్ఎల్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య చారిత్రాత్మక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలకు హై-స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను విస్తరించేందుకు భారీ ప్రణాళికలు సిద్ధమయ్యాయి. భారత్‌నెట్ ఒప్పందంతో రాష్ట్రంలో డిజిటల్ విప్లవానికి మరింత వేగం రానుంది. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ అసమానతలను తగ్గించడం, ప్రజలకు సాంకేతిక సేవలను అందుబాటులోకి తేవడం, ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించడం వంటి లక్ష్యాలకు ఈ ప్రాజెక్టు తోడ్పడనుంది. డిజిటల్ ఇండియా లక్ష్యాలను గ్రామీణ స్థాయికి తీసుకెళ్లడంలో ఈ ఒప్పందం కీలక మైలురాయిగా నిలవనుందని అధికారులు భావిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో 'సవరించిన భారత్‌నెట్ ప్రోగ్రామ్' అమలుకు కేంద్ర ప్రభుత్వం రూ. 2,432 కోట్ల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది. ఈ నిధులు డిజిటల్ భారత్ నిధి ద్వారా విడుదల కానున్నాయి. ఈ ప్రాజెక్టు అమలుతో రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలు వేగవంతం కావడంతో పాటు టెలికాం మౌలిక వసతులు మరింత బలోపేతం కానున్నాయి. కొత్త ఒప్పందం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని 13,426 గ్రామ పంచాయతీలకు హై-స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ అందించనున్నారు. ÷బైర్ నెట్ నెట్‌వర్క్‌ను విస్తరించడం ద్వారా గ్రామీణ ప్రజలకు వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రత్యేకంగా విద్య, వైద్యం, వ్యవసాయం, ఈ-గవర్నెన్స్ సేవలు గ్రామీణ ప్రాంతాల్లో మరింత సులభంగా చేరేలా ఈ ప్రాజెక్టు ఉపయోగపడనుంది. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న 3,942 గ్రామాలకు 'ఆన్-డిమాండ్ కనెక్టివిటీ' సౌకర్యం కల్పించనున్నారు. ఇప్పటివరకు సరైన నెట్‌వర్క్ లేని ప్రాంతాల్లో కూడా ఇంటర్నెట్ సేవలు అందించేందుకు ప్రత్యేక సాంకేతిక వ్యవస్థలను వినియోగించ నున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ సేవలు మరింత వేగంగా విస్తరించే అవకాశం ఏర్పడింది. ఈ ప్రాజెక్టు అమల్లో కేంద్ర టెలికాం శాఖ, బీఎస్ఎన్ఎల్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ ÷బైర్ నెట్ లిమిటెడ్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌బ్యాండ్ ఇన్‌ఫ్రాస్టక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ కీలక భాగస్వామ్య సంస్థలుగా వ్యవహరించనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణ ప్రాంతాలకు నాణ్యమైన డిజిటల్ సేవలను అందించడమే ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యంగా ఉంది. భారత్‌నెట్ ప్రాజెక్టు అమలుతో గ్రామీణ ప్రాంతాల్లో ఆన్‌లైన్ విద్యా సేవలు మరింత విస్తరించనున్నాయి. విద్యార్థులు డిజిటల్ క్లాసులు, ఆన్‌లైన్ కోర్సులు, వర్చువల్ లెర్నింగ్ సదుపాయాలను సులభంగా వినియోగించుకోగలరు. అలాగే గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో టెలీమెడిసిన్ సేవలు అందుబాటులోకి రావడంతో వైద్య సేవలు కూడా మరింత చేరువ కానున్నాయి. ప్రభుత్వ సేవలను ఆన్‌లైన్ ద్వారా పొందేందుకు ఈ-గవర్నెన్స్ వ్యవస్థకు కూడా ఇది బలాన్నిస్తుంది. రాష్ట్రంలో ఇప్పటికే అమలులో ఉన్న ÷బైర్ నెట్ సేవలను మరింత బలోపేతం చేయడమే ఈ కొత్త ఒప్పందం ముఖ్య ఉద్దేశంగా ఉంది. ప్రతి గ్రామానికి మాత్రమే కాకుండా ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ చేరేలా దశలవారీగా చర్యలు చేపట్టనున్నారు. ఇంటర్నెట్‌ను మౌలిక అవసరంగా మార్చే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును కీలకంగా భావిస్తోంది.

## పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన -- ఎంపీ గడ్డం వంశీకృష్ణ





**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మే 13 ,(చట్టం బ్యూరో) :** పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కొనుగోలు కేంద్రాన్ని ఎంపీ గడ్డం వంశీకృష్ణ సందర్శించి అక్కడున్న రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ధాన్యం తూకం విధానం, కొనుగోలు ప్రక్రియ, నిల్వ సౌకర్యాలపై రైతులు వ్యక్తం చేసిన ఇబ్బందులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా మార్కెటింగ్ అధికారితో మాట్లాడిన ఎంపీ, రైతుల సమస్యలను పట్టించుకోకపోవడంపై నిర్లక్ష్యం ఎందుకు జరుగుతోందో ఆరా తీశారు. మార్కెట్ యార్డులో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి, పారదర్శక తూకం విధానం మరియు వేగవంతమైన కొనుగోలు ప్రక్రియ అమలు చేయాలని సూచించారు. రైతులు ఇబ్బందులు పడకుండా వెంటనే చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు న్యాయం జరగడం తన ప్రాధాన్యత అని ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు.

## పలు అభివృద్ధి పనులకు భూమి పూజ

**జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్**



**రాయికల్ మే 13 చట్టం :** మండలంలోని శ్రీరాంనగర్ లో మహిళ సమాఖ్య భవనం, ఉప్పు మడుగు కస్తూరిబా గాంధీ గురుకుల విద్యాలయంలో అభివృద్ధి పనులకు బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ నేటి సమాజం లో విద్య తోనే వికాసం నాణ్యమైన విద్య తోనే భీద మధ్యతరగతి ప్రజల జీవితాల్లో వికాసం. సామాజిక ఆర్థిక అసమానతలు విద్య తో తొలగిపోతాయని అన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం పచ్చదనం పట్ల ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మెన్ కాటిపెల్లి గంగారెడ్డి, పాక్స్ చైర్మన్ రాజి రెడ్డి, సర్పంచ్ లు తళ్లపల్లి రాధిక శ్రీరామ్, కొత్తకొండ రోజా నవీన్ గౌడ్, ఎంపీడీవో చిరంజీవి, ఎంఈఓ రాఘవులు, ఎంపీ ఓ సుష్మ, ఏఈ ప్రసాద్, డి ఈ సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్ రావు, కోలశ్రీనివాస్, సురేందర్ నాయక్, ఉప సర్పంచ్ అల్లెపు గంగాధర్, మాజీ సర్పంచ్ లు రాజమౌళి, ముత్తన్న,మాజీ ఉప సర్పంచ్ లు శ్రీనివాస్,తిరుపతి రావు, గ్రామ ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మహిళ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గొట్టిపాటికి పి హెచ్ డి పట్టా




**ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం మే 13 చట్టం ప్రతినిధి :** స్థానిక ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి సమీపంలో ఉన్న డాక్టర్ ఆర్.వి.ఆర్. యన్.ఆర్.ఐ. ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యునికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్గా సేవలందిస్తున్న శ్రీ గొట్టిపాటి శ్రీనివాస్ బాబుకు గీతమ్ యూనివర్సిటీ, విశాఖపట్టణం వారిచే పి.హెచ్.డి. డిగ్రీ ప్రధానం చేయబడినది. గీతమ్ యూనివర్సిటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యునికేషన్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఆచార్యులు "డా॥ టి. గౌరి" గారి పర్యవేక్షణలో "ఇంప్లిమెంటేషన్ ఆఫ్ డీప్ లెర్నింగ్ ఫ్రేమ్ వర్క్ ఫర క్లాసిఫికేషన్ అఫ్ బ్రైన్ ట్యూమర్స్ యూజింగ్ ఎం.ఆర్.ఐ. ఇమేజెస్" అను అంశంపై పరిశోధన గావించారు. తన పరిశోధనా కాలంలో శ్రీ గొట్టిపాటి శ్రీనివాస్ బాబు గారు 1 యస్.సి.ఐ, 3 స్కోపస్ ఇండెక్స్డ్ జర్నల్స్ ప్రచురించారు.

డాక్టర్ ఆర్.వి.ఆర్. యన్.ఆర్.ఐ. ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డీమ్డ్ టు బి యూనివర్సిటీ, ఛాన్సర్ డా॥ ఆర్. వెంకట్రావు గారు, వైస్ ఛాన్సలర్ డా॥ కె.ఆర్.యస్. సాంబశివరావుగారు, ప్రొ. వైస్ ఛాన్సలర్ డా॥ జి. సాంబశివరావు గారు, ప్రొ. వైస్ ఛాన్సలర్ ఉ ప్రిన్సిపాల్ డా॥ సి. నాగభాస్కర్ గారు, రిజిస్ట్రార్ డా॥ బి. రాఘవరావు గారు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యునికేషన్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా॥ కె. రామాంజనేయులు గారు, ఇతర విభాగాధిపతులు మరియు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది శ్రీ ఎన్. మాధవరావుగారు, తదితరులు డా॥ గొట్టిపాటి శ్రీనివాస్ బాబును అభినందించారు.

చట్టం సాహితీ లోకం 95814 19999


## ఓ మాతృమూర్తి ఆవేదన



నాకు జ్ఞాపకమేర చిన్నా
స్నానం చేయడానికి నీవప్పుడు మారాం చేశావు
ఓపిక లేక నేనిప్పుడు స్నానం చెయ్యలేనంటున్నా
పాలు బువ్వ తినేటప్పుడు చిన్ని చేతులతో తీసుకు
కంచం చుట్టు మెతుకులు పోసినా ప్రేమతో ఎత్తుకు ముద్దాడాను
వార్ధక్యంలో చేతులు స్వాధీనం లేక వణుకుతు ఒళ్ళో పోసుకున్నా
నన్నిప్పుడు తిట్టకురా కన్నా
వంటచేసుకుంటున్నప్పుడు
ఏడుస్తుంటే బయటకొచ్చి చూస్తే మలమూత్రాదులతో
మలినమైన నిను శుభ్రపరచి పసిడిబొమ్మలా తయారుచేసి
చనుబాలిచ్చి నీ ఆకలితీర్చి నిద్రపుచ్చా
శరీరపటుత్వం కోల్పోయి నరాలపటుత్వం తగ్గి
నాకు తెలియకుండా బట్టతడిస్తే "ముసలి "అని చీదరించుకోకురా
మాతృదేవోభవ,పితృదేవోభవ, ఆచార్య దేవోభవ అని చెప్పినవి మాటలకే పరిమితం చేసావా బుజ్జి.
పళ్ళురాని నిన్ను పండులా ఉన్నావని ఎత్తుకున్నానే
పళ్ళు ఊడి బోసినవ్వుతో పలకరిస్తే ముఖం చిట్లించకు నాన్న
నా చిటికెన వేలు నీకందించి నడక సహాయం చేశానే
వయస్సు ముదిరి నడవలేని నాకు నీ చేతిని సహాయం కొరకివ్వక పోయినా
ఊతగా ఉన్నానమ్మా అని భరోసా ఇవ్వరా బంగారు.
పురాణాలలో శ్రావణ కుమారునిలా చూడకపోయినా
పట్టడన్నం వేళకు పెట్టి ఆకలి తీర్చరా
బ్రతికినన్నాళ్ళు నే బ్రతకనురా
నిన్నే నమ్ముకున్న నన్ను వృద్ధాశ్రమంలో పెట్టక
నీ చేతిలో పిడికెడు బూడిద నవ్వాలని
ఎదురుచూస్తున్న సగటు తల్లిని రా నేను...!!


యథార్థ సంఘటన ఆధారంగా ఆర్ద్రతతో వ్రాసిన కవిత

ఆచార్య అయ్యలసోమయాజుల ప్రసాద్
(పుష్యమి)
విశాఖపట్నం
9963265762.



చట్టం సాహితీ లోకం 95814 19999

## నేస్తం ....



నువ్వందించిన
ధైర్యం
నేను సాధించిన
విజయం
మరిచిపోనిది నేస్తం,

నువ్వు మురిపించిన
నవ్వులు
నువ్వు మధురంగచెప్పిన
మాటలు
మరిచిపోనివి నేస్తం,


నా మది తలుపులు
తెరిపించి
నా కోరికలను
పెంచేసినావు
నిన్ను మరువలేను నేస్తం,

మన అనే బంధాన్ని
రగిలించి
మనుషుల్లో ఒంటరిగా
ఉంచేసినావు
నిన్ను మరువలేను నేస్తం,

గుండెల్లో
సూదులు గుచ్చి
మనసులో
మంటలు రేపి
నన్ను బాధిస్తున్నావే నేస్తం..

//గురువు //
కార్తీక్
దుబ్బాక.
విజయవాడ...

చట్టం సాహితీ లోకం 95814 19999



## వ్యాపార అనాగరికం

కులం, మనిషి విభజనకు వేసుకున్న గాలం
మతం, మానవత్వానికి రంగు పూసిన తైలం
జాతి, మన ఐక్యతను చెరిచే నలుపు వర్ణం
ధర్మం, అన్ని మతాలను ఐక్యం చేసే సువర్ణం

నీతి నిజాయితీ సమాజానికి రెండు కళ్ళు
కళ్ళు లేని నడక సమాజంలో పెద్ద కుళ్ళు
సంపాదనే ధ్యేయమైన వ్యాపారం ఓ చిల్లు
చిల్లి గవ్వల కోసం తిరుగుతున్నారు గుళ్ళు

మట్టిలోని మాణిక్యం కాదు విలువైన ధనం
మట్టిలో పుట్టే ఆహారానికుంది గొప్ప గుణం
తప్పుడు రాతలకే అలమటిస్తున్నారు జనం
నిజం ఒప్పుకోక నశిస్తున్నాం నిత్యం మనం

నిర్జీవ వనరులకు విలువ ఎందుకిస్తున్నాం
పాత వస్తువు విలువ తగ్గించి అమ్మాలి కదా
మరి భూమికెందుకు విలువ పెంచుతున్నాం
భూసారం తగ్గిన ఇలాగే మనం కొంటున్నాం

ఇది జీవితాన్ని వ్యాపారం చేసే సోమరితనం
ఇది అసమానతలను సృష్టించే అనాగరికం
తిను బండారాల కొనుగోలుకు కావాలి ధనం
ప్రకృతి వనరుకు ఎందుకు తేరగా ప్రతి ఫలం

చాలినంత భూమిని పొందుపరుచుకోవాలి
ప్రతివారికి ప్రభుత్వం నిలువ నీడ ఇవ్వాలి
అనవసరపు భూ కబ్జాలను నిలిపివేయాలి
అనర్థదాయక వ్యాపారాలను ఆపివేయాలి.

రచన: బిటవరం శ్రీమన్నారాయణ ఎలుకుర్తి
హవేలీ, వరంగల్.

చట్టం సాహితీ లోకం 95814 19999

## స్వర్గమెక్కడ..? నరకమెక్కడ..?




ఇదేమి గోలయ్యా...
ఓసారి వినవయ్యా...
ఈ పోలయ్య కవి
చెప్పేది సత్యమేనయ్యా...!

స్వర్గం ఎక్కడో
సుదూరతీరాల్లో లేదయ్యా...
నరకం ఎక్కడో
నింగిలో దాగి లేదయ్యా...

నవ్వే నీ నవ్వు లోనే
స్వర్గం పుడుతుందయ్యా...
నలిగే గుండెలోనే
నరకం మండుతుందయ్యా...

మనసున మల్లెలు
పరిమళిస్తే స్వర్గమయ్యా...
మదిలో మంటలు
చెలరేగితే నరకమయ్యా...

ఆరోగ్యం ఆలపిస్తే
ఆనంద రాగమయ్యా...
అనారోగ్యం ఆవరిస్తే
ఆర్తి ఆవేదన రోదనేనయ్యా...

కడుపు నిండితే
బ్రతుకు కైలాసమేనయ్యా
ఆకలి మండితే బ్రతుకు
అగ్నిగుండమేనయ్యా...

ప్రేమను పంచితే ప్రతిఇల్లు
ఒక దేవాలయమేనయ్యా...
ద్వేషం పెంచితే ప్రతి ఊరు
దెయ్యాల మయమేనయ్యా...

దైవం...భూతం...
స్వర్గం... నరకం...
దాచిన అతి రహస్యాలయ్యా...
తరతరాలుగా భక్తుల నరనరాల్లో
భయంతో నాటిన భావాలయ్యా...

మతం కులం ముసుగులు
మటుమాయ మవ్వాలయ్యా...
మనిషిలో తరగని మంచితనం
మానవత్వం మేల్కొనాలయ్యా...


ఇదేమి గోలయ్యా...
ఓసారి వినవయ్యా...
ఈ పోలయ్య కవి
చెప్పేది సత్యమేనయ్యా...!

రచన:
కవిరత్న
సాహిత్య ధీర
సహస్ర కవి భూషణ్
పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్



చట్టం సాహితీ లోకం 95814 19999


## మహాసాగరం జీవచైతన్య ఘోష,,,,,!!




నా జీవితంపై ఆశ
నా ఉనికికై పెంపర్లాట
నాలోని సంతోష ఘడియలు
నా విజయాలు
నా వైఫల్యాలు
నాలోని నైరాశ్యం
నాలోని భయాలు
నాలోని గర్వం
నాలోని ఆత్మవిశ్వాసం
నేను పోగొట్టుకున్నది
నేను సాధించేది
నేను నాది అనుకునేవి
నేను ప్రేమించాను అనుకునేవి
నేను అసహ్యించుకున్నవి
నాలోని అహంకారం
అన్నీ ఈ మహాసముద్రం ఘోషలో కూలిపోయిన గోడలు,,,,
నా జీవితం అగ్నిగుండాల పాలైన పెను దుఃఖిత అలజడులన్నీ కలిపేసుకున్న భావనలో, ఊగిసలాడే కెరటాల ఊపులో ఎటూ కదలని ఈ మహాసాగరం ఉగ్రనృసింహం ఘోష చెంత మనస్సుకు ఎంత ప్రశాంతత,,,,,,,,,
సునామీల,తుఫానుల, అల్పపీడనాల సాగర గర్జనలలో ఎన్నెన్ని ప్రాణాలను కలిపేసుకుందో !?!ఎన్ని దుఃఖిత రోదనల రక్తకన్నీరు కలిసిపోయిందో,,,,,,,!?!
కాని నా దుఃఖిత మది ఈ కెరటాల గర్జనలో ఉత్తేజితమై చైతన్య పూరితమై ,ఈ భువిపై నా ఈ చిన్ని ప్రాణికి ఏం పోగొట్టుకున్నానని? ఏం బావుకుందామని నాలో ఈ సంఘర్షణ ?
మనిషిగా నాఆలోచనలు సాగర కెరటాల తుంపరల్లో నేనెంత ? ఈ దుఃఖం ఇక్కడే వదిలేస్తున్నా, నా కన్నీటి ధారలకిక వీడ్కోలు,,,,,,
నేను నేనేయైన నాలో వినూత్న జీవితానికి ఉజ్వల చైతన్య శంఖం పూరిస్తున్నా,,,,,!!??!!

అపరాజిత్
సూర్యాపేట

-----
-----



## ప్రకృతి కి ప్రతిబింబం నా రంగీ

( సరస గీతిక)

ఎండూ మిర్చీ కయ్యల్లో
పండూ మిరపా కాయల్ని
మండూటెండల్లో నేనేరు తుంటేనూ
సల్లని కారు మబ్బల్లే ఒచ్చింది నా రంగీ
ఇంద్ర దనసూనూ..ఒయ్యారంగా
వొంటికి సుట్టూ కొచ్చింది..నా రంగీ..

నడుం వొంపూలో నెలవొంకను
దాచు కొచ్చింది నా రంగీ
నడక సోయగంలో నాట్య
మయూరిని తలదన్నింది నా రంగీ
కురులలో మబ్బు తుమ్మెదల్ని
తురుము కొచ్చింది..నా రంగీ
నుదుటి పైన ఉదయ రవి
బొట్టెట్టు కొచ్చింది నా రంగీ..

బుగ్గల్లో సిగ్గుల మొగ్గల్ని
పూయించు కొచ్చింది..నా రంగీ
పండూ మిరపంటి పెదాలపై
అమృత ధారల్ని అద్దు కొచ్చింది
మేనిలో సెమట సుగంధ
పరిమళాల్ని మోసుకొచ్చింది
నా రంగీ.
అరవిరిసిన ఆ కన్నుల్లో..నా
బతుక్కి సరిపడా వెలుగు జిలుగుల్ని
నింపు కొచ్చింది..నా బంగరు రంగీ..!

( నండూరి వారి ఎంకి, నాయుడు బావల స్ఫూర్తి తో..
రాయల సీమ లో నేను సృష్టించిన పాత్రలు
ఈ రంగి, రంగడు..వీరి సరసం మోటు సీమ స్లాంగ్ లో ఉంటుంది.)

చట్టం సాహితీ లోకం 95814 19999

విజయకుమార్ గడియా
బెంగుళూరు



చట్టం సాహితీ లోకం 95814 19999

## సందిగ్ధ జీవిత ప్రయాణ



మీరు ప్రతినిత్యం పోరాటాలు చేస్తూనే ఉండాలి...
మేము ప్రతినిత్యం సంతోషంగా శాసిస్తూ ఉండాలి..!!

రక్తం కనబడని ఈ రణరంగంలో మీరు నిత్యం కొట్లాడుతూనే ఉండాలి!
రిజర్వేషన్లు లేని మా ప్రైవేటీకరణ ప్రక్రియ సజావుగా సాగిపోవాలి..!!

'మేం మిమ్మల్ని ఉద్ధరిస్తాం' అనే భ్రమలో తరతరాలుగా మీరు విశ్వసిస్తూనే ఉండాలి..!!

మీరు ప్రతిసారీ ఉద్యమాలు చేస్తూనే ఉండాలి...
మేము ప్రభుత్వ సబ్సిడీలతో విద్యాసంస్థల సామ్రాజ్యం నెలకొల్పుతాం..!!

చిత్తశుద్ధి, జవాబుదారీతనం లేని మా పాలనలోనే సమన్యాయం జరిగిపోతుందని మీరు స్వప్నిస్తూనే ఉండాలి..!!

మీరు ప్రతినిత్యం దెబ్బలాడుకుంటూనే ఉండాలి...
మేము వందల కోట్ల సబ్సిడీలతో పరిశ్రమల కోటలు కడుతూనే ఉండాలి..!!

శతాబ్దాలుగా యథావిధిగా సాగుతున్న మా దోపిడీ విధానాల వైపు మీ చూపు ఎప్పటికీ తిరగకూడదు...

మా అరాచకాలపై, అకృత్యాలపై మీరు పల్లెత్తు మాట అనకూడదు..!!

మీరు సోమరితనంతోనే మగ్గిపోవాలి...
మేము దినదినాభివృద్ధి శిఖరాలు అధిరోహిస్తూ ఉండాలి..!!

భూసమస్య, భుక్తి సమస్యపై మాతో ఉమ్మడిగా సంఘర్షించకూడదు... నోరు మెదపకూడదు..!!

మీరు ప్రతినిత్యం గొడవలు పడుతూనే ఉండాలి...
మేము వేలకోట్ల సబ్సిడీలతో కార్పొరేట్ కుబేరులమవుతూనే ఉంటాం..!!

విద్యాహక్కు, ఉపాధి, ఉద్యోగాల్లో మీ వాటా కోసం ఊసే ఎత్తకూడదు..!!

మీరు కూలీలుగానే కుళ్లిపోవాలి...
మేము సహజ వనరులను దోచుకుంటూ బలిసిపోవాలి....

సహజ వనరుల్లో మీ సహజసిద్ధ వాటా అడగకూడదు... మా దయాదాక్షిణ్యాలపై బానిసలుగా బ్రతకాలి..!!

మీరు ప్రతి ఎన్నికల్లో అనైక్యంగానే చీలిపోవాలి...
మేము ప్రతిసారీ రాజ్యాధికార పీఠం ఎక్కాలి..!!

మీలో మీరు ఎప్పుడూ కొట్లాడుతూనే ఉండాలి...

మేము పాలకవర్గ మన్ననలతో మెగా కార్పొరేట్ హాస్పిటల్స్ సామ్రాజ్యం నిర్మిస్తాం..!!

ఆర్థిక స్వావలంబన, రాజ్యాధికార సాధన లాంటి మాటలు మీ ఊహకైనా రాకూడదు...

మీరు ప్రతిసారీ హక్కుల ఉల్లంఘనపై పోరాటాలు చేస్తూనే ఉంటారు...
మేము ప్రభుత్వ ఆర్థిక సహకారంతో ఇంజనీరింగ్, వైద్య కళాశాలలు, ఆగ్రో ఇండస్ట్రీస్ నిర్మిస్తూనే ఉంటాం....!!

మీ ఉద్యమ నేతలను నమ్మకూడదు...
సామాజిక చైతన్యం, అవగాహన మీకు అంటకూడదు..!!

మేము నిరంతరం చప్పట్లు చరుచుకుంటూ వినోదిస్తూ విలాసవంతమైన జీవితం గడుపుతాం...

మీరు పేదరిక నిర్మూలనపై పోరాటాలు చేస్తూనే ఉండాలి...
మేము ఆర్థిక, రాజకీయ, పారిశ్రామికంగా అధిపతులమవుతూనే ఉండాలి..!!

ఒక పీత పైకెళ్తుంటే మరో పీత కాళ్ళు పట్టి లాగడం...
ఎవరూ పైకి వెళ్ళకుండా ఒకరినొకరు కింద పడేయడం...
మీలోని ఈ స్వభావమే, ఈ బలహీనతే మాకు శ్రీరామరక్ష.

నాలుగు కులాలు నాలుగు గ్రూపులౌతాయనుకున్నాం...
ఒక్క కులంలోనే వంద కుంపట్లు పెట్టుకున్నారా?

నాలుగు కులాలకు నలుగురైదుగురు నాయకులు పుడతారనుకున్నాం...
మీరేంట్రా, ఒక్కో కులంలోనే వందమంది బ్రోకర్లు తయారయ్యారు?
చెట్టు పేరు చెప్పుకొని కాయలమ్ముకుంటున్నారు..!!

కులాల చీలిక ప్రభావం మహా అయితే ఓ ఐదేళ్ళుంటుందనుకున్నాం...
మీరేంట్రా, వందేళ్ల శత్రుత్వం పెంచుకున్నారు?
మీ అనైక్యమే మా శ్రీరామరక్ష!

రచన: అనగల్లు మునిరత్నం
పూతలపట్టు, చిత్తూరు జిల్లా
చరవాణి:9963288544

చట్టం సాహితీ లోకం 95814 19999

## మహాకవి భారవి (ఇష్టపదులు)



1.
బాల్య దశ నందున ప్రతిభను సాధించిన
భారవి కవి పొందెను భవ్యమైన ఖ్యాతిని,
తనను పొగడ లేదని తండ్రిపై కోపపడె,
కలత చెందెను పిదప కారణమును గ్రహించి,
అత్త గారి యింటిన ఆరు నెల లున్నచో,
అదియే శిక్ష యనుచు అతనికి తండ్రి జెప్పె,
గర్వ భంగ మాయెను కవివరుడు భారవికి,
సతి గృహంబు నందున సకలము తెలిసె కృష్ణా!!

2.
కిరాతార్జునీయమ్మం గీర్వాణము నందున
రచించె భారవి కవి రమణీయంబు గాను,
అరణ్య పర్వ మందు అల్ప భాగమ్మం దీసి
వ్రాసెను భారవి కవివర్యులు మెచ్చు రీతిం,
మూకాసురుడు పొందె ముట్టెమెకము రూపును,
పార్థ, శివులు కొట్టిరి బాణముతో దానిని,
వాదములు మొదలాయె వారిద్దరి మధ్యన,
పాశుపత మిడె శివుడు ఫల్గుణునికి కృష్ణా!!

డాక్టర్ కురవి వేంకట కృష్ణ శాస్త్రి, చెన్నై

----------

## చట్టం సాహితీ లోకం

95814 19999

### అందం

అందం అనేది
ఒక కొలతలో ఇమిడిపోయే
విషయం కాదు...
అది కళ్లతో చూసేదానికంటే,
మనసుతో అనుభవించేదే
ఎక్కువ.



పొడవు ఉన్నా అందమే,
పొట్టిగా ఉన్నా అందమే.
తెలుపు వెలుగైతే
నలుపు లోతు
రెండింటికీ ప్రకృతి ఇచ్చిన
అందమే వేరు.

కళ్లలో మెరుపు ఉండొచ్చు,
ముక్కులో తీరు ఉండొచ్చు,
కానీ నిజమైన అందం
మాటలో మాధుర్యం,
మనసులో మంచితనం,
ప్రవర్తనలో పరిమళం.

అధికారంతో వచ్చే గౌరవం వేరు,
ఐశ్వర్యంతో వచ్చే ఆకర్షణ వేరు,
కానీ మనిషిని గుర్తుండిపోయేలా చేసేది
అతని హృదయం.

అందం అనేది
దృష్టికోణం మారితే రూపం మార్చుకునే
అద్దం లాంటిది.
ఎవరి ఆలోచన, అనుభవం, అభిరుచి
ప్రకారం
అది పరి పరి విధాలుగా కనిపిస్తుంది.

చివరికి
"మనసుకు నచ్చింది అందం"
అనే మాటే శాశ్వత సత్యం.

రామడుగు వేణుగోపాల్
దోహా , ఖతార్ ( మంథని )


# బన్నీతో మరోమారు జతకట్టనున్న పూజా



బుట్టబొమ్మ పూజా హెగ్డే కు అదృష్టం పట్టిందని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. పూజా వరుసగా అరడజను సినిమాలు డిజాస్టర్ అందుకున్నాయి. ఈ లెక్కన పూజా హెగ్డే పేరు కూడా ఎక్కడా వినిపించ కూడదు. కానీ, అదేంటో ఈ చిన్నది వరుస ఫ్లాపులను అందుకున్నా అవకాశాలు మాత్రం కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్నాయి. ప్రస్తుతం పూజా చేతిలో మూడు సినిమాలు ఉన్నాయి. ఇప్పటికే ఆమె నటించిన జననాయగన్ రిలీజ్ కి సిద్ధమవుతోంది. ఇది కాకుండా హిందీలో వరుణ్ ధావన్ సరసన తేరా హో జాన్ సినిమాలో పూజా నటిస్తోంది. ఇందులో అమ్మడి అందాల ఆరబోత చూసి ఫ్యాన్స్ షాక్ అవుతున్నారు. ఇక ఇప్పుడు పూజా మరో లక్కీ ఛాన్స్ ని పట్టేసిందని సమాచారం. అల్లు అర్జున్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెల్సిందే. కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో బన్నీ నటిస్తోన్న రాకా శరవేగంగా షూటింగ్ జరుపుకొంటుంది. దీని తరువాత బన్నీ, మరో కోలీవుడ్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ డైరెక్షన్ లో ఒక సినిమా చేయనున్న విషయం తెల్సిందే. ఈ చిత్రంలో బన్నీకి జోడిగా పూజా హెగ్డే పేరును అనుకుంటున్నారట. ఇప్పటికే బన్నీతో దువ్వాడ జగన్నాథం, అల వైకుంఠపురంలో లాంటి సినిమాల్లో నటించింది. ఇక ఇప్పుడు ముచ్చటగా మూడోసారి ఈ జంట రొమాన్స్ చేయనున్నారు. త్వరలోనే లోకేష్ .. పూజాను అధికారికంగా సినిమాలోకి ఆహ్వానించనున్నాడట. అయితే పూజా అదృష్టం బానే ఉన్నా.. మార్కెట్ పరంగా బన్నీకి రిస్క్ అని కొందరు చెప్పుకొస్తున్నారు.

# కన్నడసీమలో తీవ్ర విషాదం

## గుండెపోటుతో నటుడు, నిర్మాత దిలీప్ రాజ్ మృతి





కన్నడ చిత్రపరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రముఖ నటుడు, నిర్మాత దిలీప్ రాజ్ (47) బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో కన్నుమూశారు. బెంగళూరులోని తన నివాసంలో ఉన్న సమయంలో ఆయనకు ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దిలీప్ రాజ్ మృతితో శాండల్‌వుడ్ దిగ్భ్రాంతికి గురైంది. ఈ వార్త తెలుసుకున్న 'కాంతార' నటుడు రిషబ్ శెట్టి సోషల్ మీడియా వేదికగా దిలీప్ రాజ్‌కు నివాళు లు అర్పించారు. 'ఒక మంచి నటుడు, దర్శకుడు, నిర్మాత.. అన్నింటికీ మించి ఒక అద్భుతమైన మనిషి. మనం కలిసిన సందర్భాలు తక్కువైనా, మీ వ్యక్తిత్వం నా గుండెల్లో ఎప్పటికీ చెరగని ముద్ర వేసింది. మీ ఆత్మకు శాంతి చేకూరాలి' అంటూ రిషబ్ శెట్టి ఎమోషనల్ పోస్ట్ చేశారు.

దిలీప్ రాజ్ కేవలం నటుడిగానే కాకుండా నిర్మాతగా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా కూడా కన్నడ ఇండస్ట్రీలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. పునీత్ రాజ్‌కుమార్ నటించిన 'మిలనా' చిత్రంలో ఆయన పోషించిన ప్రతినాయకుడి పాత్ర ఆయన కెరీర్‌లోనే మైలురాయిగా నిలిచింది. 'యు-టర్న్', 'బాయ్‌ఫ్రెండ్' వంటి పలు విజయవంతమైన సినిమాలతో పాటు 'హిట్లర్ కళ్యాణ' వంటి పాపులర్ సీరియల్స్‌లోనూ ఆయన నటించారు. ఆయన మృతి పట్ల కన్నడ సినీ ప్రముఖులు మరియు అభిమానులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

# విడాకులకపై నటి మౌనీ రాయ్ చిరాకు

### అవాస్తవ ప్రచారాలు ఆపాలని పోస్ట్



తన భర్త సూరజ్ నంబియార్‌తో విడిపోతున్నట్టుగా వచ్చిన రూమర్లపై నటి మౌనీరాయ్ స్పందించారు. అవాస్తవాలను ప్రచారం చేయడం మానుకోవాలని సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. తమ వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించొద్దని విజ్ఞప్తి చేశారు. మౌనీరాయ్, సూరజ్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరినొకరు అన్‌ఫాలో కావడంతో విడిపోతున్నారన్న ప్రచారం జరగ్గా నటి రియాక్ట్ అయ్యారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే మౌనీరాయ్ కొన్ని రోజులుగా భర్తతో ఉన్న ఫొటోలు పోస్ట్ చేయలేదు. మరోవైపు, సూరజ్ నంబియార్ ఇన్‌స్టాలో పెళ్లి ఫొటోలు కూడా కనిపించడం లేదు. ప్రస్తుతం ఆయన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా అందుబాటులో లేకపోవడం గమనార్హం. అకౌంట్‌ను డిలీట్ చేసినట్టు సమాచారం. 2022 జనవరిలో సూరజ్ నంబియార్- మౌనీరాయ్ వివాహం జరిగింది. 'నాగిని' సీరియల్‌తో ఆకట్టుకున్న మౌనీరాయ్.. 'గోల్డ్', 'బ్రహ్మాస్త్ర' తదితర సినిమాల్లో నటించారు. 'కేజీయఫ్ చాప్టర్ 1' (కన్నడ), 'వేదా' (హిందీ) తదితర చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్‌తో అలరించారు.

## చట్టం చిత్రం


# శ్రీను వైట్లతో శర్వానంద్ మూవీ



టాలీవుడ్ హీరో శర్వానంద్ ప్రస్తుతం వరుస విజయాలతో మంచి జోష్‌లో ఉన్నారు. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా విడుదలైన 'నారీ నారీ నడుమ మురారి' కుటుంబ ప్రేక్షకులను అలరించి బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకుంది. అలాగే ఇటీవల విడుదలైన మోటోక్రాస్ రేసింగ్ నేపథ్యంలో తెరకెక్కిన 'బైకర్' కూడా ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందింది. ఈ విజయాల ఊపుతో శర్వానంద్ ఇప్పుడు వరుసగా విభిన్న కథలను ఎంపిక చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్న 'భోగి' చిత్రంలో శర్వానంద్ నటిస్తున్నారు. 1960ల నాటి నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి కథానాయికలుగా కనిపించనున్నారు. ఈ సినిమా చిత్రీకరణ వేగంగా కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, ఇప్పుడు శర్వానంద్ తన తదుపరి చిత్రాన్ని హాస్య కథా చిత్రాల దర్శకుడు శ్రీను వైట్లతో చేయడానికి సిద్ధమైనట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ సినిమాలో శ్రీను వైట్ల మార్క్ కామెడీకి తోడు 'కాలయానం' అనే వైవిధ్యమైన అంశాన్ని జోడిస్తున్నట్లు సమాచారం. హాస్యంతో పాటు సైన్స్ ఫిక్షన్ అంశాలు కలిస్తే ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతి కలుగుతుందని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. మొదట ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వారు ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారని సమాచారం. ఇప్పుడు ఈ చిత్రాన్ని నిర్మాత అనిల్ సుంకర తన నిర్మాణ సంస్థ ద్వారా నిర్మించబోతున్నట్లు తెలుస్తోంది. 'నారీ నారీ నడుమ మురారి' తర్వాత శర్వానంద్-అనిల్ సుంకర కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై మంచి అంచనాలు నెలకొన్నాయి.జులై 2026 నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని, వచ్చే సంక్రాంతికి చిత్రాన్ని విడుదల చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు సమాచారం. ఇక హీరోయిన్ ఎంపిక విషయంలో కూడా ఆసక్తికర చర్చ సాగుతోంది. తొలుత పూజా హెగ్డే, మమితా బైజు పేర్లు వినిపించినా, తాజా సమాచారం ప్రకారం మిస్ ఇండియా రన్నరప్ మానస వారణాసిని హీరోయిన్‌గా ఎంపిక చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల 'కపుల్ ఫ్రెండ్లీ' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న ఈ తెలుగమ్మాయి, శర్వానంద్ సరసన నటించేందుకు అంగీకరించినట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.ఒకవేళ ఇదే నిజమైతే శర్వానంద్-మానస జోడీ వెండితెరపై కొత్త ఫీల్‌ను తీసుకురావడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం కథా పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే చిత్రబృందంపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని సమాచారం.

# రెజ్లింగ్ నేపథ్యంలో పెద్ది మూవీ

### దంగల్‌తో పోల్చకుండా జాగ్రత్తలు




ప్రస్తుతం రామ్ చరణ్ అభిమానులు ఎదురుచూస్తోన్న చిత్రం 'పెద్ది'. బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుండడంతో టీమ్ ప్రచారం జోరు పెంచింది. ఈ నేపథ్యంలో తాజాగా 'పెద్ది' ఆర్ట్ డైరెక్టర్ అవినాశ్ కొల్లా ఓ ఇంటర్వ్యూలో మేకింగ్ విశేషాలు పంచుకున్నారు. ఈ సినిమా కూడా కుస్తీ (రెజ్లింగ్) నేపథ్యంలో సాగుతుంది. దీంతో ఇది బాలీవుడ్ బ్లాక్ బస్టర్ 'దంగల్'ను గుర్తుచేయకుండా ఉండటమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకులకు 'దంగల్' సినిమా అస్సలు గుర్తుకు రాకూడదనేది మా టీం ముందున్న అతిపెద్ద సవాలు. అందుకే సెట్ వర్క్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. ఎక్కడా దంగల్‌ను పోలిన సెట్‌లు వేయలేదు. అలా ఉండకూడదనేదే ప్రధాన ఉద్దేశంగా పని చేశాం. ప్రేక్షకులు ఇదివరకే ఇలాంటి సెట్స్ చూశామనే భావన కలగకుండా ఉండటానికి మేము ఎన్నో ప్రయోగాలు చేశాం. 'పెద్ది'లో కొన్ని కొత్త ఆలోచనలు కూడా చేశాం' అని అవినాశ్ కొల్లా చెప్పారు. తన కెరీర్‌లోనే ఇది అత్యుత్తమ స్క్రిప్ట్ అని, ఇలాంటి గొప్ప చిత్రానికి పనిచేసే అవకాశం రావడం తన అదృష్టమని తెలిపారు. కథలోని ఎమోషన్‌ను ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా చేయడంలో తన వంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. రామ్ చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్ నటించిన ఈ సినిమాను రూ.300 కోట్ల భారీ బ్జడెట్‌తో రూపొందిస్తున్నారు. మే 18న దీని ట్రైలర్ విడుదల కానుంది. కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, దివ్యేందు, జగపతిబాబు, బొమన్ ఇరానీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రుతిహాసన్ స్పెషల్ సాంగ్‌లో మెరవనున్నట్లు సమాచారం.

# సన్ రైజర్స్ బ్యాటింగ్ వైఫల్యం



ఐపీఎల్ 2026 సీజన్ లో మాజీ చాంపియన్ సన్ రైజర్స్ హైదరాబాద్ ఘోర పరాజయం పాలైంది. మంగళవారం గుజరాత్ టైటాన్స్ తో జరిగిన మ్యాచ్ లో 82 పరుగులతో ఓడిపోయింది. అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ లో టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 168 పరుగులు చేసింది. ఓపెనర్ సాయి సుదర్శన్ సూపర్బ్ ఫిఫ్టీ (44 బంతుల్లో 61, 5 ఫోర్లు, 2 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. బౌలర్లలో ప్రఫుల్ హింగే, షకీబ్ హుస్సేన్ లకు తలో రెండు వికెట్లు దక్కాయి. అనంతరం ఛేజింగ్ లో సన్ బ్యాటర్లు ఘోరంగా విఫలమయ్యారు. కేవలం 14.5 ఓవర్లలో 86 పరుగులకు ఆలౌటయ్యారు. పాట్ కమిన్స్ కెప్టెన్ ఇన్నింగ్స్ (19) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. బౌలర్లలో కగిసో రబాడ, జేసన్ హోల్డర్ కు తలో మూడు వికెట్లు దక్కాయి. ఈ విజయంతో ఎనిమిదో విజయంతో గుజరాత్ టాప్ ప్లేస్ ను దక్కించుకుంది. ఇక బుధవారం జరిగే మ్యాచ్ లో కోల్ కతా నైట్ రైడర్స్ తో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తలపడనుంది. స్లో వికెట్ పై ఓ మాదిరి టార్గెట్ తో బరిలోకి దిగిన సన్ రైజర్స్ కు శుభారంభం దక్కలేదు. తొలి ఓవర్ వేసిన మహ్మద్ సిరాజ్ వణికించాడు. అతని బౌలింగ్ లో ఆడేందుకు తంటాలు పడిన ఓపెనర్ ట్రావిస్ హెడ్, ఆఖరికి నాలుగో బంతికి డకౌటయ్యాడు. ఆ తర్వాత ఆ ఓవర్ ను మెయిడిన్ చేసిన సిరాజ్.. శుభారంభం అందించాడు. అయితే రెండో ఓవర్ వేసిన రబాడ, సన్ కు పెద్ద షాకిచ్చాడు. సూపర్ ఫామ్ లో ఉన్న అభిషేక్ శర్మ (6)ను క్లీన్ బౌల్డ్ చేశాడు. నిజానికి కాస్త రూమ్ తీసుకుని ఆడదామని అభిషేక్ ట్రై చేయగా, అతడిని ఫాలో చేస్తూ, వేసిన బంతి, అభిషేక్ బ్యాట్ ను తాకి, నేరుగా వికెట్లను గిరాటేసింది. ఆ తర్వాత వరుస ఓవర్లలో ఇషాన్ కిషన్ (11), స్మరణ్ రవిచంద్రన్ (9) ను ఔట్ చేసి పెద్ద షాకిచ్చాడు. దీంతో ఇక్కడే ఫలితం దాదాపుగా తేలిపోయింది. ఇక పవర్ ప్లేలో కేవలం 34 పరుగులే చేసిన సన్.. టార్గెట్ ఛేదిస్తున్నట్లు ఎప్పుడూ అనిపించలేదు. క్రీజులో డేంజరస్ గా గడిపి, కొన్ని బౌండరీలు కొట్టిన సలీల్ ఆరోరా (16)ను తన తొలి ఓవర్లోనే ప్రసిధ్ కృష్ణ ఔట్ చేశాడు. ఇక తర్వాతి ఓవర్లోనే ఆదుకుంటాడనుకున్న హెన్రిచ్ క్లాసెన్ (14)ను హోల్డర్ పెవిలియన్ కు పంపడంతో సన్ కథ దాదాపుగా ముగిసి పోయింది. బ్యాటింగ్ ఆర్డర్లో చాలా వెనుకగా వచ్చిన తెలుగు కుర్రాడు నితీశ్ రెడ్డి (2) కూడా విఫలమయ్యాడు. ఆఖర్లో కమిన్స్ రెండు సిక్సర్లు, ఒక ఫోర్ బాదడంతో స్కోరు ఆ మాత్రమైన వచ్చింది. తను వెనుదిరిగాక ఆరెంజ్ ఆర్మీ పరాజయం ఖాయమైపోయింది. 3 వికెట్లు తీసిన రబాడకు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. ఇక 16 పాయింట్లు సాధించిన గుజరాత్ దాదాపుగా ప్లే ఆఫ్ బెర్త్ దక్కించుకున్నట్లేనని తెలుస్తోంది.




# అగ్రస్థానానికి చేరుకున్న రబడ



ఐపీఎల్ 2026 సీజన్‌లో సౌతాఫ్రికా స్పీడ్‌స్టర్ కగిసో రబడ తన ప్రతాపాన్ని కొనసాగిస్తున్నాడు. అహ్మదాబాద్ వేదికగా మంగళవారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో రబడ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో ప్రత్యర్థి టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. ఈ మ్యాచ్‌లో తన కోటా 4 ఓవర్లలో కేవలం 28 పరుగులు మాత్రమే ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. ముఖ్యంగా కొత్త బంతితో రబడ వేసిన స్పెల్ ఈ సీజన్‌లోనే అత్యంత ప్రమాదకరమైనదిగా నిలిచింది. పవర్‌ప్లేలోనే అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, స్మరణ్ రవిచంద్రన్ వంటి కీలక బ్యాటర్లను పెవిలియన్ పంపి హైదరాబాద్ టీమ్‌ను కోలుకోలేని దెబ్బ తీశాడు. ఈ అదిరిపోయే ప్రదర్శనతో రబడ ఐపీఎల్ చరిత్రలో ఒక అరుదైన మైలురాయిని చేరుకున్నాడు. ఈ సీజన్ పవర్‌ప్లే ఓవర్లలో రబడ ఇప్పటివరకు మొత్తం 16 వికెట్లు సాధించాడు. తద్వారా ఒకే ఐపీఎల్ సీజన్ పవర్‌ప్లేలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో మిచెల్ జాన్సన్ (2013), ట్రెంట్ బౌల్ట్ (2020) రికార్డులను సమం చేశాడు. ప్రస్తుతం రబడ కంటే ముందు కేవలం మహమ్మద్ షమీ మాత్రమే ఉన్నాడు. షమీ 2023 సీజన్‌లో పవర్‌ప్లేలో 17 వికెట్లు పడగొట్టి టాప్‌లో ఉన్నాడు. రబడ ప్రస్తుత ఫామ్ చూస్తుంటే ఈ రికార్డును బ్రేక్ చేయడం పెద్ద కష్టమేమీ కాదనిపిస్తోంది. ప్రస్తుత 2026 సీజన్ పవర్‌ప్లే వికెట్ల చార్ట్‌లో కూడా రబడ అందరికంటే చాలా ముందున్నాడు. రబడ 16 వికెట్లతో అగ్రస్థానంలో ఉండగా, భువనేశ్వర్ కుమార్ 12 వికెట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. జోఫ్రా ఆర్చర్, మహమ్మద్ సిరాజ్ చెరో 9 వికెట్లతో తర్వాత స్థానాల్లో ఉన్నారు. రబడ ఎకానమీ కొంచెం ఎక్కువగా ఉన్నప్పటికీ, వికెట్లు తీయడంలో మాత్రం తనదైన మార్క్ చూపిస్తున్నాడు. వికెట్లు తీయడం వల్ల ప్రత్యర్థి టీమ్ రన్ రేట్‌ను కంట్రోల్ చేయడంలో రబడ సక్సెస్ అవుతున్నాడు. ఈ మ్యాచ్‌లో రబడ దెబ్బకు సన్‌రైజర్స్ బ్యాటర్లు క్రీజులో నిలదొక్కుకోవడానికి చాలా ఇబ్బంది పడ్డారు. పవర్‌ప్లే ముగిసేసరికి హైదరాబాద్ స్కోరు కేవలం 34/4 మాత్రమే. ఈ సీజన్‌లో సన్‌రైజర్స్‌కు ఇది రెండో అత్యల్ప పవర్‌ప్లే స్కోరు కావడం గమనార్హం. అలాగే పవర్‌ప్లేలోనే 4 వికెట్లు కోల్పోవడం హైదరాబాద్ టీమ్‌కు ఈ సీజన్‌లో ఇదే మొదటిసారి. అంతకుముందు గుజరాత్ టైటాన్స్ బ్యాటర్లు సాయి సుదర్శన్, వాషింగ్టన్ సుందర్ హాఫ్ సెంచరీలతో రాణించి తమ జట్టుకు 168 పరుగుల గౌరవప్రదమైన స్కోరు అందించారు. ఆ తర్వాత టార్గెట్ ఛేజింగ్‌లో సన్‌రైజర్స్ సెటిల్ అవ్వకుండా రబడ ఆరంభం నుండే ఒత్తిడి పెంచాడు. ముందుగా అభిషేక్ శర్మను ఎక్స్‌ట్రా పేస్ ఇంకా బౌన్స్‌తో అవుట్ చేసిన రబడ, ఆ వెంటనే ఇషాన్ కిషన్‌ను తన ట్రాప్‌లో పడేసాడు. తన స్పెల్ మధ్యలో స్మరణ్ రవిచంద్రన్‌ను కూడా అవుట్ చేసి హైదరాబాద్ అగ్రెసివ్ బ్యాటింగ్ లైనప్‌ను కకావికలం చేసాడు. ఈ సీజన్ అంతటా రబడ తన రా పేస్, అక్యురేట్ లెంగ్త్ తో బ్యాటర్లను భయపెడుతున్నాడు. పిచ్ ఎలాంటిదైనా సరే తన బౌలింగ్‌తో వికెట్లు రాబట్టడం రబడకు వెన్నతో పెట్టిన విద్య. గుజరాత్ టైటాన్స్ దగ్గర ఐపీఎల్‌లోనే అత్యంత పవర్‌ఫుల్ పేస్ అటాక్ ఎందుకు ఉందో రబడ మరోసారి నిరూపించాడు.

# ప్యాట్ కమిన్స్‌పై బీసీసీఐ వేటు..




ఐపీఎల్ 2026లో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఘోర ఓటమి చవిచూసిన సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అహ్మదాబాద్‌లో జరిగిన ఈ పోరులో జట్టు ప్రదర్శనపై విమర్శలు వస్తుండగానే, కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌పై బీసీసీఐ భారీ జరిమానా విధించింది. స్లో ఓవర్ రేట్ కారణంగా కమిన్స్ ఈ శిక్షకు గురయ్యారు. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత సమయంలో ఓవర్లను పూర్తి చేయలేకపోయింది. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం.. స్లో ఓవర్ రేట్ తప్పిదానికి పాల్పడినందుకు కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌కు రూ.12 లక్షల జరిమానా విధిస్తున్నట్లు బీసీసీఐ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ సీజన్‌లో హైదరాబాద్ జట్టుకు ఇది మొదటి తప్పిదం కావడంతో కేవలం జరిమానాతో సరిపెట్టారు. ఐపీఎల్ నిబంధనల ప్రకారం, ఒక కెప్టెన్ పదే పదే ఈ తప్పిదాన్ని పునరావృతం చేస్తే కఠిన చర్యలు ఉంటాయి. జరిమానా మొత్తం రూ.25 లక్షలు దాటితే కెప్టెన్‌కు ఒక డీమెరిట్ పాయింట్ ఇస్తారు. అయితే 2025 సీజన్ నుంచి వచ్చిన మార్పుల ప్రకారం.. ఓవర్ రేట్ తప్పిదాల వల్ల నేరుగా నిషేధం విధించరు. ఒకవేళ ఒక సీజన్‌లో 5 డీమెరిట్ పాయింట్లు వస్తేనే సదరు కెప్టెన్ లేదా ఆటగాడిపై ఒక మ్యాచ్ నిషేధం పడే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం కమిన్స్ కేవలం ఒకసారే ఈ తప్పిదం చేశారు కాబట్టి ఆయన ఆడేందుకు ఎలాంటి అడ్డంకులు లేవు.కావ్య మారన్ నేతృత్వంలోని సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్రస్తుతం 12 మ్యాచ్‌లలో 14 పాయింట్లతో పాయింట్ల పట్టికలో మూడవ స్థానంలో ఉంది. గుజరాత్ చేతిలో 82 పరుగుల తేడాతో ఓడిపోవడం జట్టు నెట్ రన్ రేట్‌పై ప్రభావం చూపింది. ప్లేఆఫ్స్ రేసులో ఉన్న సన్‌రైజర్స్‌కు ఇప్పుడు కెప్టెన్‌పై జరిమానా పడటం మానసికంగా కొంత ఇబ్బంది కలిగించే విషయమే. ఇదే సీజన్‌లో శ్రేయాస్ అయ్యర్ ఇప్పటికే రెండుసార్లు జరిమానా కట్టి రూ.36 లక్షలు చెల్లించడం గమనార్హం. రూ. 14 కోట్లకు రిటైన్ చేసుకున్న ప్యాట్ కమిన్స్, తదుపరి మ్యాచ్‌లలో జట్టును సమయానికి ఓవర్లు వేయించేలా నడిపించాల్సి ఉంటుంది. రాబోయే మ్యాచ్‌లలో మళ్ళీ ఈ పొరపాటు జరిగితే జరిమానా పెరగడమే కాకుండా డీమెరిట్ పాయింట్లు వచ్చే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఓటమితో డీలా పడ్డ కావ్య మారన్ సేన, ఈ నిబంధనల విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# వైభవ్ సూర్యవంశీకి ఏబీ డివిలియర్స్ ఛాలెంజ్!



భారత క్రికెట్లో ప్రస్తుతం సెన్సేషన్‌గా మారిన 15 ఏళ్ల యువ కెరటం వైభవ్ సూర్యవంశీ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. ఐపీఎల్ 2025లో రాజస్థాన్ రాయల్స్ తరఫున అరంగేట్రం చేసినప్పటి నుంచి విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి దిగ్గజాల మధ్య కూడా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. అద్భుతమైన హిట్టింగ్ సామర్థ్యం ఉన్న వైభవ్ ప్రతిభను మైఖేల్ వాన్, అలిస్టర్ కుక్ వంటి మాజీలు కొనియాడారు. త్వరలోనే వైభవ్ భారత సీనియర్ జట్టులోకి వస్తాడని అంతా భావిస్తున్నారు.అయితే ఆర్సీబీ లెజెండ్ ఏబీ డివిలియర్స్ మాత్రం వైభవ్ సూర్యవంశీ భవిష్యత్తుపై భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. స్టువర్ట్ బ్రాడ్, జోస్ బట్లర్ నిర్వహించిన 'ఫర్ ది లవ్ ఆఫ్ క్రికెట్' పాడ్‌కాస్ట్‌లో ఏబీ డివిలియర్స్ మాట్లాడుతూ.. వైభవ్ సూర్యవంశీ కెరీర్ సుదీర్ఘంగా సాగాలంటే అతను కేవలం టీ20లకు మాత్రమే పరిమితం కాకూడదని సూచించారు. "వైభవ్‌లో అద్భుతమైన ప్రతిభ ఉంది, కానీ అతను ఎక్కువ కాలం రాణించగలడా? అనే దానిపై నాకు అనుమానం ఉంది" అని ఏబీ డివిలియర్స్ స్పష్టం చేశాడు.ఏబీడీ దృష్టిలో టీ20 క్రికెట్, టెస్ట్ క్రికెట్ మధ్య చాలా తేడా ఉంటుంది. వైభవ్ సూర్యవంశీ తనను తాను కేవలం టీ20 స్పెషలిస్ట్‌గా మార్చుకుంటే అతని కెరీర్ విజయవంతంగా సాగుతుందని.. కానీ వన్డేలు, టెస్టుల్లోకి అడుగుపెడితే మాత్రం కఠినమైన సవాళ్లు ఎదురవుతాయని హెచ్చరించాడు. టెస్ట్ క్రికెట్‌లో మానసిక, శారీరక దృఢత్వం చాలా అవసరమని.. అక్కడ ఎదురయ్యే అడ్డంకులను అధిగమించడం అంత సులభం కాదని ఆయన అభిప్రాయపడ్డాడు. "వైభవ్ సూర్యవంశీకి అన్ని రకాల షాట్లు ఆడే సత్తా ఉంది, కానీ టెస్ట్ క్రికెట్ ఆడేటప్పుడు అతను తనలోని కొత్త కోణాన్ని కనుగొనాల్సి ఉంటుంది. అది ఒక గంభీరమైన ప్రయాణం లాంటిది. అతను ఆ సవాళ్లను దాటుకుని తన దేశం తరఫున టెస్టులు ఆడాలని నేను కోరుకుంటున్నాను" అని డివిలియర్స్ ముగించాడు. మరి ఈ 15 ఏళ్ల వండర్ కిడ్, ఏబీడీ విసిరిన ఈ సవాల్‌ను స్వీకరించి భవిష్యత్తులో అన్ని ఫార్మాట్లలో రాణిస్తాడో లేదో వేచి చూడాలి.

# అర్ధరాత్రి 1:30 కు హార్దిక్ ప్రాక్టీస్



ఈ ఐపీఎల్ సీజన్ ముంబై ఇండియన్స్ ఏ మాత్రం కలిసిరాలేదు. వరుస మ్యాచ్ లల్లో ఓటమి పాలైన ఈ మోస్ట్ సక్సెస్ ఫుల్ టీమ్.. ఇప్పటికే ప్లేఆఫ్స్ నుంచి అవుట్ అయింది. దానికి తోడు కేప్టెన్ హార్దిక్ పాండ్యా వివాదాల్లో చిక్కుకున్నాడు. నడుం నొప్పి, జట్టు యాజమాన్యంతో విభేదాలు, కెప్టెన్సీ విషయంలో విమర్శలు.. ఇలా ముప్పేట దాడిని ఎదుర్కొంటోన్నాడు.నడుం నొప్పితో ఐపీఎల్ లో మిగిలిన మ్యాచ్ లకు దూరం అవొచ్చునే వార్తలకు తాజాగా చెక్ పెట్టాడు హార్దిక్ పాండ్యా. తన తాజా వీడియోతో వాటన్నింటికీ ఫుల్ స్టాప్ పెట్టాడు. ధర్మశాల వేదికగా గురువారం పంజాబ్ కింగ్స్‌తో జరగనున్న మ్యాచ్‌కు ముందు.. తాను పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నాని నిరూపించుకునే ప్రయత్నం చేస్తోన్నాడు. ముంబైలో అర్ధరాత్రి 1:30 గంటలకు నెట్ సెషన్స్ లో కనిపించాడు హార్దిక్. బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు. తనదైన శైలిలో భారీ షాట్లు ఆడాడు. ముంబై ఇండియన్స్ ఆడిన చివరి రెండు మ్యాచ్‌లకు హార్దిక్ పాండ్యా నడుము నొప్పి కారణంగా దూరమయ్యాడు. అతని గైర్హాజర్ కావడం పుకార్లకు తెరతీసింది. జట్టులో విభేదాలు తలెత్తాయని, అతని పేలవమైన కెప్టెన్సీ పట్ల మేనేజ్మెంట్ కూడా ఆగ్రహంతో ఉందనే ఊహాగానాలు చెలరేగాయి. తాజా వీడియోతో ఈ విమర్శలకు తెరదించాడు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 1:30 గంటల సమయంలో ముంబైలోని రిలయన్స్ కార్పొరేట్ పార్క్‌లో హార్దిక్ తీవ్రంగా సాధన చేస్తూ కనిపించారు. ఈ గ్రౌండ్ రిలయన్స్ కార్పొరేట్ పార్క్ కు చెందినది కావడం వల్ల జట్టు యాజమాన్యంతో కూడా విభేదాలు లేవనే విషయాన్ని చెప్పకనే చెప్పినట్టయింది. ఈ వీడియోలో అతను కఠోరమైన శిక్షణలో పాల్గొనడం, బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ తన నైపుణ్యాలను సానబెట్టుకోవడం చూడొచ్చు.అన్ని పుకార్లకు అడ్డుకట్ట వేశాడు అనే క్యాప్షన్‌తో ఈ వీడియో పోస్ట్ అయింది. ఈ ఐపీఎల్ సీజన్‌లో ముంబై ఇండియన్స్ నిరాశజనకంగా ఆడుతోంది. ఇప్పటికే ప్లేఆఫ్ రేసు నుంచి కూడా నిష్క్రమించింది. 11 మ్యాచ్‌ల్లో ఆరు పాయింట్లతో పాయింట్ల పట్టికలో తొమ్మిదో స్థానంలో కొనసాగుతోంది. హార్దిక్ సారథ్యంలో ముంబై ఇండియన్స్ పాయింట్ల పట్టికలో అట్టడుగుకు చేరడం గత మూడేళ్లలో ఇది రెండోసారి. హార్దిక్ గైర్హాజరీలో సూర్యకుమార్ యాదవ్ జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు. గురువారం జరిగే మ్యాచ్‌కు హార్దిక్ అందుబాటుపై అనుమానాలు నెలకొనడంతో, సూర్యకుమార్ యాదవ్ మరోసారి జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించే అవకాశం ఉంది.

# వింత షాట్‌తో అదరగొట్టిన వాషింగ్టన్ సుందర్



ఐపీఎల్ 2026లో గుజరాత్ టైటాన్స్ దూసుకుపోతోంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను 82 పరుగుల భారీ తేడాతో ఓడించి, పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. ఈ మ్యాచ్‌లో అందరి దృష్టిని ఆకర్షించింది మాత్రం వాషింగ్టన్ సుందర్ కొట్టిన ఆ అద్భుతమైన సిక్సర్. ఏకంగా గ్రౌండ్‌పై కూర్చుని మరీ కొట్టిన ఆ షాట్‌ను చూసి స్టేడియం మొత్తం ఒక్కసారిగా హోరెత్తిపోయింది. గుజరాత్ ఇన్నింగ్స్ 19వ ఓవర్‌లో ఈ వింత దృశ్యం చోటుచేసుకుంది. ఇషాన్ మలింగ వేసిన లో-ఫుల్ టాస్ బంతిని వాషింగ్టన్ సుందర్ అద్భుతంగా డీల్ చేశాడు. దాదాపు నేలపై కూర్చుని, ఆ బంతిని డీప్ మిడ్ వికెట్ మీదుగా ఫ్లాట్ సిక్సర్‌గా మలిచాడు. ఈ షాట్ చూసిన గుజరాత్ టైటాన్స్ ఆటగాళ్లంతా డగౌట్‌లో లేచి నిలబడి చప్పట్లు కొట్టారు. క్రికెట్ చరిత్రలోనే ఇది ఒక అత్యంత అరుదైన, క్రియేటివ్ షాట్ అని విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు.టాస్ గెలిచిన గుజరాత్ మొదట బ్యాటింగ్ చేపట్టింది. పిచ్ బ్యాటింగ్‌కు అంత సులభంగా లేకపోయినా, సాయి సుదర్శన్ (61) ఎంతో పరిణతితో ఆడాడు. మరోవైపు వాషింగ్టన్ సుందర్ కేవలం 33 బంతుల్లోనే 50 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. వీరిద్దరి వీరోచిత పోరాటంతో గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. వికెట్ కష్టంగా ఉంది, అందుకే చివరి వరకు క్రీజులో ఉండాలని ప్లాన్ చేశామని మ్యాచ్ అనంతరం సుందర్ చెప్పుకొచ్చాడు.169 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆరంభం నుంచే తడబడింది. గుజరాత్ బౌలర్లు కగిసో రబాడ (3/28), జేసన్ హోల్డర్ (3/20) నిప్పులు చెరిగే బంతులతో హైదరాబాద్ బ్యాటర్లను వణికించారు. పవర్‌ప్లే ముగిసేసరికే హైదరాబాద్ 60 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ తర్వాత కోలుకోలేకపోయిన ఆరెంజ్ ఆర్మీ కేవలం 14.5 ఓవర్లలో 86 పరుగులకే కుప్పకూలింది.ఈ గెలుపుతో గుజరాత్ టైటాన్స్ ఈ సీజన్‌లో వరుసగా ఐదో విజయాన్ని నమోదు చేసింది. టీమ్ వర్క్, పక్కా ప్లానింగ్ తో గుజరాత్ ఇప్పుడు ఐపీఎల్ 2026లో అత్యంత బలమైన జట్టుగా కనిపిస్తోంది. రబాడ, సిరాజ్ వంటి వరల్డ్ క్లాస్ బౌలర్లు నెట్స్‌లో ఎదుర్కోవడం వల్లే తమ బ్యాటింగ్ మెరుగుపడిందని సుందర్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నాడు. హైదరాబాద్‌ను చిత్తు చేసిన గుజరాత్, ఇప్పుడు టైటిల్ రేసులో అందరికంటే ముందు వరుసలో నిలిచింది.

# మసూద్ కెప్టెన్సీపై పెద్ద ఎత్తున విమర్శలు

## బాబర్‌కు మళ్లీ కెప్టెన్సీ పగ్గాలు ఇచ్చే చాన్స్!



ఢాకా వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన మొదటి టెస్టులో పాకిస్థాన్ 104 పరుగుల తేడాతో అవమానకరమైన ఓటమిని చవిచూసింది. ఈ ఓటమి పాక్ క్రికెట్ వర్గాల్లో తీవ్ర కలకలం సృష్టించింది. ముఖ్యంగా కెప్టెన్ షాన్ మసూద్ కెప్టెన్సీపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. 2023 డిసెంబర్‌లో కెప్టెన్సీ చేపట్టిన మసూద్.. ఇప్పటివరకు తాను సారథ్యం వహించిన 15 మ్యాచ్‌ల్లో 11 ఓటములను చూడటం గమనార్హం. కేవలం కెప్టెన్సీలోనే కాకుండా, బ్యాటింగ్‌లో కూడా అతను ఘోరంగా విఫలమవ్వడం జట్టు యాజమాన్యాన్ని అసహనానికి గురిచేస్తోంది.జట్టును గాడిలో పెట్టేందుకు పీసీబీ మళ్లీ బాబర్ ఆజం వైపు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. మోకాలి గాయం కారణంగా మొదటి టెస్టుకు దూరమైన బాబర్.. మే 18 నుంచి ప్రారంభమయ్యే రెండో టెస్టుకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో పాకిస్థాన్ ఇంకా ఏడు టెస్టులు ఆడాల్సి ఉండటంతో అనుభవజ్ఞుడైన బాబర్‌కు మళ్లీ పగ్గాలు అప్పగించాలని బోర్డులోని కొందరు కీలక సభ్యులు భావిస్తున్నారు. బాబర్ కూడా తిరిగి కెప్టెన్సీ చేపట్టేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఓటమి భారంతో తీవ్ర నిరాశలో ఉన్న షాన్ మసూద్.. తన కెప్టెన్సీ నుంచి తప్పుకుని బోర్డులో శాశ్వత బాధ్యతలు చేపట్టే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. గతంలోనే పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ అతనికి 'డైరెక్టర్ ఆఫ్ ఇంటర్నేషనల్ క్రికెట్ అండ్ ప్లేయర్ అఫైర్స్' పదవిని ఆఫర్ చేశారు. అయితే అప్పట్లో డబ్ల్యూటీసీ సైకిల్ పూర్తి చేయాలనే ఉద్దేశంతో మసూద్ ఆ ఆఫర్‌ను తిరస్కరించాడు. ప్రస్తుత పరిస్థితుల్లో అతను ఆ పదవిని చేపట్టే అవకాశం మెండుగా కనిపిస్తోంది. రాబోయే వన్డే ప్రపంచకప్ నాటికి జట్టును సిద్ధం చేయడంలో భాగంగా, బాబర్‌ను ముందుగా టెస్టు కెప్టెన్‌గా చేసి, ఆపై వన్డే బాధ్యతలు కూడా అప్పగించాలని బోర్డు యోచిస్తోంది. 2019 నుండి 2023 వరకు మూడు ఫార్మాట్లలో కెప్టెన్‌గా ఉన్న బాబర్, ఆ తర్వాత జరిగిన పరిణామాల వల్ల తప్పుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు మళ్లీ అతనికి పూర్తిస్థాయి బాధ్యతలు ఇస్తే జట్టులో స్థిరత్వం వస్తుందని బోర్డు భావిస్తోంది. రెండో టెస్టులో బాబర్ రాణిస్తే, అధికారికంగా ఈ మార్పులు జరిగే అవకాశం ఉంది.

Edited, Published and Owned by Baddala LaKshmi Narayana, and Printed at BADDAL Publications, #B.No.28/07, R.G.K. Apartments, Bellary Road, Kurnool - 518 003. A.P.
Editor Baddala Lakshmi Narayana, Redg. No. APTEL/2011/40367. chattamnews@gmail.com. baddalpublications@gmail.com. Cell: 916000 3999 / 4999 / 5999